మీరే చదువరి.. క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి.. ప్రపంచవ్యాప్త వార్తలు చదవండి...


నేటి
# ఈవార్తలు
NETI EVARTHALU
దినపత్రిక

మీరే విలేకరి.. క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి.. మీ ప్రాంతంలోని వార్తలు పంపండి..

సోమవారం MONDAY 3-11-2025 | జగిత్యాల JAGITIAL | పేజీలు: 8 PAGES:8 | వెల రూ.2.00 PRICE: 2.00 | సంపుటి: 1 Volume:1 | సంచిక: 124 Issue: 124

Published from Jagitial
www.evarthalu.com

శ్రీ విశ్వావసు నామ సంవత్సరం దక్షిణాయనం - శరత్ ఋతువు కార్తీక మాసం - శుక్లపక్షం సూర్యోదయం - ఉ. 6:19 సూర్యాస్తమయం - సా. 5:40 తిథిః త్రయోదశి రా. 2:02o వరకు తరువాత చతుర్దశి సంస్కృత వారం ఇందు వాసరః నక్షత్రం ఉత్తరాభాద్ర మ. 2:52 వరకు తరువాత రేవతి యోగం హర్షణ రా. 7:30 వరకు కరణం కౌలవ మ. 3:35 వరకు తైతుల రా. 2:02o వరకు వర్జ్యం రా. 1:49 నుండి తె. 3:15 వరకు దుర్ముహూర్తం మ. 12:22 నుండి మ. 1:07 వరకు మ. 2:38 నుండి మ. 3:23 వరకు రాహుకాలం ఉ. 7:44 నుండి ఉ. 9:09 వరకు యమగండం ఉ. 10:34 నుండి ఉ. 11:59 వరకు గుళికాకాలం మ. 1:24 నుండి మ. 2:49 వరకు బ్రహ్మముహూర్తం తె. 4:43 నుండి తె. 5:31 వరకు అమృత ఘడియలు ఉ. 10:53 నుండి మ. 12:21 వరకు అభిజిత్ ముహూర్తం ఉ. 11:36 నుండి మ. 12:22 వరకు గమనిక: "o" అనగా మరుసటి రోజున



# బాహుబలి.. జయహో!

## ఇస్రో ఖాతాలో మరో విజయం.. సీఎంఎస్-03 ప్రయోగం గ్రాండ్ సక్సెస్

### సుమారు 4,400 కిలోల బరువున్న ఈ ఉపగ్రహం నిర్దేశిత కక్ష్యలోకి ఉపగ్రహాన్ని కచ్చితత్వంతో ప్రవేశపెట్టిన ఇస్రో

భారత అంతరిక్ష పరిశోధన సంస్థ (ఇస్రో) మరో భారీ విజయాన్ని తన ఖాతాలో వేసుకుంది. భారత నేవీ కోసం ప్రత్యేకంగా రూపొందించిన అత్యాధునిక కమ్యూనికేషన్ ఉపగ్రహం సీఎంఎస్-03ను విజయవంతంగా ప్రయోగించింది. శ్రీహరికోటలోని సతీశ్ ధావన్ స్పేస్ సెంటర్ నుంచి బాహుబలి రాకెట్ ఎల్వీఎం3-ఎం5 ద్వారా ఈ ఉపగ్రహాన్ని నింగిలోకి పంపారు.

శ్రీహరికోట, నవంబర్ 2 (ఈవార్తలు): నిర్ణీత సమయానికి నింగిలోకి దూసుకెళ్లిన ఎల్వీఎం3-ఎం5 రాకెట్, సీఎంఎస్-03 ఉపగ్రహాన్ని కచ్చితత్వంతో నిర్దేశిత కక్ష్యలోకి ప్రవేశపెట్టింది. అనంతరం రాకెట్ నుంచి ఉపగ్రహం విజయవంతంగా విడిపోయిందని ఇస్రో శాస్త్రవేత్తలు ప్రకటించారు. ఈ ప్రయోగం సంపూర్ణ విజయం సాధించిందని, ఇంజెక్షన్ ప్రక్రియ కచ్చితంగా జరిగిందని వారు తెలిపారు. జీశాట్-7ఆర్‌గా కూడా పిలిచే ఈ సీఎంఎస్-03 ఉపగ్రహం, భారత నావికాదళానికి ఇప్పటివరకు ఉన్నవాటిలో అత్యంత ఆధునికమైనది. ఇది నేవీ యొక్క అంతరిక్ష ఆధారిత కమ్యూనికేషన్ వ్యవస్థను, సముద్ర జలాలపై నిఘా సామర్థ్యాన్ని తరువాయి 2 వ పేజీలో...

### శ్రేష్ఠతకు మారుపేరుగా ఇస్రో



మన అంతరిక్ష రంగం దేశానికి గర్వకారణంగా నిలుస్తోంది. అత్యంత బరువైన కమ్యూనికేషన్ ఉపగ్రహం సీఎమ్ఎస్-03ను విజయవంతంగా ప్రయోగించిన ఇస్రోకు అభినందనలు. మన శాస్త్రవేత్తల కృషితో మన అంతరిక్ష రంగం శ్రేష్ఠతకు, ఆవిష్కరణలకు మారుపేరుగా నిలిచింది. ఈ విజయాలు దేశ ప్రగతికి దోహదపడటమే కాకుండా, ఎంతోమంది జీవితాలను శక్తిమంతం చేస్తున్నాయి.

– ప్రధాని మోదీ




మహిళల వన్డే ప్రపంచకప్ 2025లో టీమిండియా విశ్వ విజేతగా నిలిచింది. ఆదివారం నవీ ముంబై వేదికగా సౌతాఫ్రికాతో జరిగిన ఫైనల్లో సమష్టిగా రాణించిన హర్మన్‌సేన 52 పరుగుల తేడాతో గెలుపొందింది. ఈ విజయంతో ఎన్నోఏళ్ల నిరీక్షణకు తెరదించుతూ ప్రపంచకప్‌ను ముద్దాడింది. అభిమానులతో కిక్కిరిసిన మైదానంలో తమ చిరకాల కోరికను నెరవేర్చుకుంది. ఆఖరి వరకు ఉత్కంఠగా సాగిన ఈ మ్యాచ్‌లో దీప్తి శర్మ మ్యాజిక్.. షెఫాలీ వర్మ ఆల్‌రౌండ్ షో. అమన్ జోత్ కౌర్ స్టన్నింగ్ క్యాచ్ భారత్‌కు విజయాన్నందించాయి.

భారత మాతృభూమి గర్భంలో పుట్టిన సింహినులారా, మీ బ్యాట్ ధ్వని ప్రపంచకప్ మైదానంలో గర్జించింది!
భారత నారీ శక్తిని ప్రపంచానికి చాటింది!!
ప్రపంచకప్ ట్రోఫీ మీ చేతుల్లో మెరిసింది
ఇది కేవలం విజయం కాదు, ఒక మహోత్సవం!
జై హింద్! జై భారత మహిళా జట్టు!

## భారత మహిళ.. విజయహో!

విశ్వవిజేతగా టీమిండియా మహిళల జట్టు

52 పరుగుల తేడాతో హర్మన్ సేన ఘన విజయం

దీప్తి శర్మ మ్యాజిక్.. షెఫాలీ వర్మ ఆల్‌రౌండ్ షో



## అదిరిందయ్యా సుందరం


వాషింగ్టన్ సుందర్ విధ్వంసం.. మూడో టీ20లో భారత్ ఘన విజయం!

ఐదు మ్యాచ్‌ల సిరీస్‌లో 1-1.. పూర్తి వివరాలు 'క్రీడావాణి' పేజీలో..

### బంగారం-వెండి ధరలు

| | |
|---|---|
| బంగారం (గ్రాము-24 క్యారెట్స్): | రూ.12,300 |
| వెండి (గ్రాము): | రూ.166 |
| ప్లాటినం (గ్రాము): | రూ.4,481 |

### విశ్వవాణి



ఏఐ వినియోగం పెరిగిన నేపథ్యంలో డీప్ ఫేక్ నుంచి తన ప్రజలను కాపాడేందుకు కాపీరైట్ చట్టాన్ని అమలు చేయాలని డెన్మార్క్ నిర్ణయించింది. ఈ చట్టం ద్వారా డెన్మార్క్ ప్రజలకు వారి ముఖం, గొంతు, శరీరంపై హక్కులు కల్పించాలని ప్రతిపాదించింది.

# పల్లెపల్లెకు బీసీ

## బీసీ రిజర్వేషన్ల కోసం రాజ్యాంగ సవరణ చేయాల్సిందే

రిజర్వేషన్ల విషయంలో ఇక ప్రత్యక్ష సమరమే.. బీసీ నేతలు ఒకటే అజెండాగా కలిసి సాగుదాం. నవంబర్‌లో పార్లమెంటు ముట్టడి చేపడదాం

నేటి ఉద్యమమే రేపటి సామాజిక తెలంగాణ.. బీసీ జేఏసీ విస్తృత స్థాయి సమావేశంలో నేతలు.. అష్టాంగ ఆందోళన పేరుతో 2 నెలల కార్యాచరణ



హైదరాబాద్, నవంబర్ 2 (ఈవార్తలు): బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు సాధించడమే లక్ష్యంగా పోరాటాలను ఉధృతం చేయాలని బీసీ జేఏసీ నిర్ణయించింది. బీసీ రిజర్వేషన్ల పెంపు కోసం ఈనెల 20వ తేదీ నుంచి జరిగే పార్లమెంట్ సమావేశాల్లో రాజ్యాంగ సవరణ చేసి బీసీ రిజర్వేషన్ల చట్టానికి ఆమోదం తెలపాలని, లేదంటే గల్లీ నుండి ఢిల్లీ వరకు బీసీలు ఇక ప్రత్యక్ష పోరాటానికి సిద్ధపడాలని అఖిలపక్ష పార్టీల నేతలు, బీసీ, ఎస్సీ, ఎస్టీ మైనార్టీ నాయకులు సంయుక్తంగా హెచ్చరించారు. ఆదివారం హైదరాబాద్‌లోని బంజారాహిల్స్‌లో ఉన్న కళింగ కల్చరల్ సెంటర్‌లో బీసీ జేఏసీ రాష్ట్రస్థాయి విస్తృత సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి బీసీ జేఏసీ వర్కింగ్ చైర్మన్ జాజుల శ్రీనివాస్ గౌడ్ అధ్యక్షత వహించగా, కో చైర్మన్ దాసు సురేష్ , కోఆర్డినేటర్ గుజ్జ కృష్ణలు సమన్వయం చేశారు. ఉదయం 11 గంటలకు ప్రారంభమైన తరువాయి 2 వ పేజీలో...



## యాక్సిడెంట్ అయితే.. కాంట్రాక్టర్లకు భారీ జరిమానా

### కేంద్ర ప్రభుత్వం కీలక నిర్ణయం

జాతీయ రహదారులపై ప్రమాదాలు, మరణాలను తగ్గించే లక్ష్యంగా కేంద్ర ప్రభుత్వం పలు చర్యలు తీసుకుంటోంది. ఇందులో భాగంగా జాతీయ రహదారిలోని నిర్దిష్ట ప్రాంతంలో సంవత్సరంలో ఒకటి కంటే ఎక్కువ ప్రమాదాలు సంభవిస్తే సంబంధిత కాంట్రాక్టర్లకు భారీ జరిమానా విధించాలని రహదారుల మంత్రిత్వ శాఖ నిర్ణయించినట్లు తెలిసింది.

న్యూఢిల్లీ: బిల్ట్-ఆపరేట్-ట్రాన్స్‌ఫర్ విధానంలో నిర్మించే రహదారులకు దీన్ని వర్తింపజేయనున్నట్లు ఓ సీనియర్ అధికారి మీడియాకు వెల్లడించారు. బీవోటీ విధానంలో నిర్మించే హైవేలపై ప్రమాదాలు జరగకుండా చూసుకోవాల్సిన బాధ్యత కాంట్రాక్టర్ల దేనని, వారే దిద్దుబాటు చర్యలు తీసుకోవాలని జాతీయ రహదారుల మంత్రిత్వశాఖ కార్యదర్శి వి. ఉమాశంకర్ వెల్లడించారు. ఇందుకు సంబంధించి బీఓటీ పత్రాన్ని తరువాయి 2 వ పేజీలో...

## దమ్ముంటే బియ్యం ఆపి చూడు

సీఎం రేవంత్‌కు కిషన్ రెడ్డి సవాల్.. ఓట్ల కోసం బెదిరింపులు సిగ్గుచేటు

మజ్లిస్‌కు కాంగ్రెస్ లొంగిపోతోంది.. కేంద్రమంత్రి కిషన్ రెడ్డి విమర్శలు



జూబ్లీహిల్స్/హైదరాబాద్, నవంబర్ 2 (ఈవార్తలు): జూబ్లీహిల్స్ అసెంబ్లీ ఉపఎన్నికలో కాంగ్రెస్ పార్టీకి ఓటు వేయకపోతే ప్రభుత్వ పథకాలు, ఉచిత బియ్యం రద్దవుతాయని ఓటర్లను బెదిరించడం సిగ్గుచేటని కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి విమర్శించారు. ఆదివారం బీజేపీ రాష్ట్ర కార్యాలయంలో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో ఆయన కాంగ్రెస్ పార్టీపై తీవ్ర స్థాయిలో ధ్వజమెత్తారు. ఇటీవల ఎన్నికల - 2 వ పేజీలో...

## అంత ధైర్యముందా?

పెద్దోళ్ల ఇండ్లు, ఫాంహౌజ్‌లు కూల్చగలదా?

పెద్దోళ్లకో న్యాయం, పేదలకో న్యాయంగా హైడ్రా తీరు

బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ మండిపాటు

హైడ్రా చర్యలపై పవర్ పాయింట్ ప్రజెంటేషన్



హైదరాబాద్, నవంబర్ 2 (ఈవార్తలు): తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం పేదల ఇళ్ల కూల్చివేతలకు పాల్పడుతోందని, ఈ అన్యాయంపై కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ ఎందుకు మౌనంగా ఉన్నారని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ తీవ్రస్థాయిలో -2 వ పేజీలో...

## రాశి ఫలాలు

3.11.2025

మేషం: నూతన కార్యక్రమాలకు శ్రీకారం చూడతారు. వ్యాపారాలు సజావుగా సాగుతాయి. సంతానం నుండి శుభవార్తలు అందుతాయి. దైవదర్శనాలు చేసుకుంటారు. ఉద్యోగమున పదోన్నతులు పెరుగుతాయి. ఆర్థిక అనుకూలత కలుగుతుంది. పాతమిత్రుల కలయిక ఆనందం కలిగిస్తుంది.

వృషభం: వృత్తి, వ్యాపారాలు సామాన్యంగా సాగుతాయి. ఆర్థిక లావాదేవీలు నిరాశ కలిగిస్తాయి. చేపట్టిన పనులు మందకోడిగా సాగుతాయి. ఇంటా బయట ఒత్తిడి పెరుగుతుంది. ఆరోగ్య విషయంలో జాగ్రత్త అవసరం. బంధువులతో చిన్నపాటి వివాదాలు తప్పవు.

మిథునం: నూతన వాహనయోగం ఉన్నది. వ్యాపారాలు లాభసాటిగా సాగుతాయి. చేపట్టిన పనులలో కార్యసిద్ధి కలుగుతుంది. ఉద్యోగులకు జీతాభత్యాల విషయంలో శుభవార్తలు అందుతాయి. గృహమున బంధు మిత్రులతో ఉత్సాహంగా గడుపుతారు. ఆధ్యాత్మిక చింతన పెరుగుతుంది.

కర్కాటకం: వ్యాపారాలు లాభసాటిగా సాగుతాయి. నిరుద్యోగుల కష్టం ఫలిస్తుంది. నూతన వ్యక్తుల పరిచయం ఉత్సాహనిస్తుంది. బంధువుల నుంచి శుభవార్తలు అందుతాయి. నూతన వాహనయోగం ఉన్నది. దైవ సేవా కార్యక్రమాలలో పాల్గొంటారు. ఆకస్మిక ధనలాభ సూచనలున్నవి.

సింహం: అనారోగ్య సమస్యలు బాధిస్తాయి. నూతన రుణాలు చేస్తారు. వృధా ప్రయాణాలు చెయ్యవలసి వస్తుంది. వ్యాపార, ఉద్యోగాలు చికాకు తప్పవు. కుటుంబ వ్యవహారాలలో సొంత ఆలోచనలు కలసిరావు. బంధువులతో ఆకస్మిక తగాదాలు ఉంటాయి.

కన్య: నూతన రుణాలు చేస్తారు. వ్యాపారాలు స్వల్పంగా లాభిస్తాయి. కుటుంబ సమస్యలు వలన మానసిక ప్రశాంతత ఉండదు. ఆకస్మిక ప్రయాణ సూచనలున్నవి. ఉద్యోగాలలో కొంత గందరగోళ పరిస్థితులుంటాయి. ఆరోగ్య విషయంలో అశ్రద్ధ చెయ్యడం మంచిది కాదు. చేపట్టిన పనుల్లో అవాంతరాలు తప్పవు.

తుల: ఉద్యోగమున ముఖ్య నిర్ణయాలు తీసుకుంటారు. దూరపు బంధువుల నుండి శుభవార్తలు అందుతాయి. వ్యాపారాలు గతం కంటే మెరుగవుతాయి. నిరుద్యోగ ప్రయత్నాలు ఫలిస్తాయి. చేపట్టిన పనుల్లో విజయం సాధిస్తారు. నూతన వస్తు వాహనాలు కొనుగోలు చేస్తారు.

వృశ్చికం: దైవ సేవా కార్యక్రమాలలో కుటుంబ సభ్యులతో పాల్గొంటారు. ఇంటాబయట అనుకూల వాతావరణ ఉంటుంది. వ్యాపారాలు విస్తరిస్తారు. ఆప్తుల నుండి కొత్త విషయాలు తెలుసుకుంటారు. వృత్తి ఉద్యోగాలలో మీ ప్రతిభ వెలుగులోకి వస్తుంది.

ధనస్సు: చేపట్టిన పనులలో శ్రమ పెరుగుతుంది. వ్యాపార ఉద్యోగాలు నిరుత్సాహపరుస్తాయి. కుటుంబ సభ్యులతో చిన్నపాటి విభేదాలు తప్పవు. దైవ చింతన పెరుగుతుంది. ఆర్థిక ఇబ్బందులు వలన నూతన రుణ ప్రయత్నాలు చేస్తారు. ప్రయాణాలు వాయిదా వేయడం మంచిది.

మకరం: సోదరులతో స్థిరాస్తి వివాదాలు కలుగుతాయి. ముఖ్యమైన వ్యవహారాలు నత్తనడకన సాగుతాయి. అశ్రద్ధ చేయడం మంచిది కాదు. ఉద్యోగాలలో అధికారుల నుండి విమర్శలు తప్పవు. పాత రుణాలు తీర్చడానికి నూతన రుణాలు చేస్తారు. వృత్తి వ్యాపారాలలో శ్రమకు తగ్గ ఫలితం కనిపించదు.

కుంభం: వృత్తి, వ్యాపారాలు సాఫీగా సాగుతాయి. నూతన వాహనం కొనుగోలు చేస్తారు. నిరుద్యోగులకు నూతన ఉద్యోగ అవకాశాలు లభిస్తాయి. ముఖ్యమైన వ్యవహారాలు ఆశించిన విధంగా సాగుతాయి. చేపట్టిన పనులు సకాలంలో పూర్తి చేస్తారు. ఆత్మీయుల నుంచి శుభవార్తలు అందుకుంటారు.

మీనం: వృత్తి వ్యాపారాలలో శ్రమాధిక్యత పెరుగుతుంది. చిన్ననాటి మిత్రులతో వివాదాలకు దూరంగా ఉండటం మంచిది. ఉద్యోగాలలో అధికారుల నుంచి ఒత్తిడి పెరుగుతుంది. దూర ప్రయాణ సూచనలు ఉన్నవి. ఆర్థిక ఇబ్బందులు ఎదురవుతాయి. ముఖ్యమైన పనులు వాయిదా వేస్తారు.



# పల్లెపల్లెకు బీసీ

**మొదటి పేజీ తరువాయి**

జేఏసీ సమావేశం సాయంత్రం 6 గంటల వరకు 7 గంటల పాటు సుదీర్ఘంగా కొనసాగింది. ఈ సమావేశం సమాలోచనలతో దీర్ఘకాలిక వ్యూహంతో జరిగింది. ఈ సమావేశానికి బీసీ సంఘాలు, కుల సంఘాలు, ఉద్యోగ సంఘాలు, ఉపాధ్యాయ, న్యాయవాద, డాక్టర్స్, మేధావుల సంఘాల నేతలతో పాటు రాష్ట్రంలోని అన్ని యూనివర్సిటీల నుంచి ప్రొఫెసర్లు, విద్యార్థి నాయకులు వేలాదిమంది హాజరయ్యారు. ఈ సమావేశానికి ఎంపీ ఈటల రాజేందర్, మాజీ మంత్రి వి శ్రీనివాస్ గౌడ్, మాజీ స్పీకర్ మధుసూదన్ చారి, మాజీ ఎంపీ వి హనుమంతరావు, ప్రభుత్వ విప్ బీర్ల ఐలయ్య, ఎమ్మార్పీఎస్ జాతీయ అధ్యక్షుడు మందకృష్ణ మాదిగ, మాల మహానాడు జాతీయ అధ్యక్షుడు ఎమ్మెల్సీ అద్దంకి దయాకర్, మైనింగ్ కార్పొరేషన్ చైర్మన్ ఈరావత్ అనిల్, ప్రముఖ సినీ నటులు ఆర్.నారాయణమూర్తి, సినీ దర్శకుడు ఎన్ శంకర్, తెలంగాణ రచయితల వేదిక అధ్యక్షుడు జూలూరీ గౌరీశంకర్, రిటైర్డ్ ఐఏఎస్ చోల్లేటి ప్రభాకర్ పాల్గొని మాట్లాడారు.

### బీజేపీ నేతగా రాలేదు.. బీసీ బిడ్డగా వచ్చా: ఈటల రాజేందర్

బీసీ జేఏసీ సమావేశానికి బీజేపీ నేతగా తాను రాలేదని, ఒక బీసీ బిడ్డగా హాజరయ్యానని, బీసీ రిజర్వేషన్ల సాధన కోసం బీసీ జేఏసీ చేస్తున్న పోరాటానికి తన వంతు మద్దతు ఉంటుందని ఈటల రాజేందర్ తెలిపారు. దేశంలో ఈడబ్ల్యూఎస్ రిజర్వేషన్లు వచ్చాక రిజర్వేషన్లు లేని వర్గం అంటూ ఏదీ లేదని రిజర్వేషన్లు అనుభవిస్తున్న సామాజిక వర్గాలలో బీసీలకే అన్యాయం జరుగుతుందని అన్నారు. దగా పడ్డ బీసీలు దండుగట్టే సమయం ఆసన్నమైందన్నారు. బీసీ జేఏసీ నాయకత్వం ఏ రాజకీయ పార్టీలో లేని నిస్వార్థంతో, నిజాయతీతో బీసీల కోసం ఉద్యమించేవారు బాధ్యత తీసుకోవాలని, గమ్యాన్ని ముద్దాడేవరకు ఈ ఉద్యమాన్ని ముందుకు తీసుకుపోవాలని ఆకాంక్షించారు.

### వెనక్కి తగ్గే ప్రసక్తే లేదు

బీసీ రిజర్వేషన్ల విషయంలో కాంగ్రెస్ పార్టీ వెనక్కి తగ్గే ప్రసక్తి లేదని, రాహుల్ గాంధీ ఆదేశించిన విధంగానే కాంగ్రెస్ పార్టీ చిత్తశుద్ధితో అసెంబ్లీలో చేసిన చట్టం అమలు చేయాలని నిర్ణయించిందని కాంగ్రెస్ నేతలు అన్నారు. వచ్చే పార్లమెంట్ సమావేశాల్లో ఇండియా కూటమి తరఫున ఒత్తిడి తీసుకువస్తామని, కాంగ్రెస్ ప్రభుత్వం తరఫున త్వరలోనే అఖిలపక్షంతో ఢిల్లీకి వెళ్లి ప్రధానిని కలుస్తామని అన్నారు. బీసీ రిజర్వేషన్ల విషయంలో బీసీ జేఏసీ చేస్తున్న పోరాటానికి బీసీ బిడ్డలుగా తమ సంపూర్ణ మద్దతు ఉంటుందని కాంగ్రెస్ నేతలు వి హనమంతరావు, ప్రభుత్వ విప్ బీర్ల ఐలయ్య, మైనింగ్ చైర్మన్ ఈరవత్ అనిల్ వెల్లడించారు.

### తెలంగాణలో మరో ఉద్యమం: మధుసూదన్ చారి, శ్రీనివాస్ గౌడ్

దశాబ్దాలుగా బీసీలకు రాజకీయంగా అన్యాయం జరుగుతూనే ఉందని పార్టీలను పక్కనపెట్టి బీసీలకు సామాజిక న్యాయం దక్కడానికి తెలంగాణలో మరో పోరాటాన్ని రూపొందించాలని మధుసూదనాచారి, శ్రీనివాస్ గౌడ్ పిలుపునిచ్చారు. బీసీ రిజర్వేషన్ల సాధనలో బీసీలు ఇప్పుడు కాకపోతే ఇంకెప్పుడు కాదు.. అనే రీతిలో ఒక్కటే జట్టు గట్టి పోరాడాలని, బీఆర్ఎస్ పార్టీగా, బీసీ బిడ్డలుగా బీసీ జేఏసీ ఉద్యమానికి సంపూర్ణ మద్దతు ఉంటుందని వెల్లడించారు. తెలంగాణ ఉద్యమం తరహాలోనే బీసీ రిజర్వేషన్ల ఉద్యమాన్ని ముందుకు నడిపించాలని సూచించారు.

### ప్రత్యక్షంగానే ఉద్యమంలో పాల్గొంటాం: మందకృష్ణ

బీసీ ఉద్యమానికి ఎమ్మార్పీఎస్ వెన్నంటి ఉంటుందని, బయట నుండి మద్దతు ఇవ్వకుండా బీసీ ఉద్యమంలో ప్రత్యక్షంగా పాల్గొనడానికి తాము సిద్ధంగా ఉన్నామని ఎమ్మార్పీఎస్ జాతీయ అధ్యక్షుడు మందకృష్ణ మాదిగ అన్నారు. బీసీ ఉద్యమాన్ని శాంతియుతంగా, ప్రజాస్వామ్య యుతంగా ముందుకు తీసుకెళ్తే కచ్చితంగా విజయం సాధించడం ఖాయమన్నారు. నాటి దేశ స్వాతంత్ర పోరాటం నుండి నేటి వర్గీకరణ పోరాటం వరకు శాంతియుతంగా పోరాడితేనే విజయం సిద్ధించిందని, ఇప్పుడు కూడా కాంగ్రెస్, బీజేపీపై ఒత్తిడి పెంచడానికి శాంతియుత పోరాటమే లక్ష్యంగా బీసీ ఉద్యమం ముందుకు సాగాలని ఆకాంక్షించారు.

### అష్టాంగ ఆందోళనలు:


బీసీ జేఏసీ విస్తృత స్థాయి సమావేశంలో అష్టాంగ ఆందోళనల పేరుతో భవిష్యత్తు ఉద్యమ కార్యాచరణను బీసీ జేఏసీ వర్కింగ్ చైర్మన్ జాజుల శ్రీనివాస్ గౌడ్, కో చైర్మన్ దాసు సురేష్ కోఆర్డినేటర్ గుజ్జ కృష్ణ ప్రకటించారు.

1) నవంబర్ 6న రాష్ట్రవ్యాప్తంగా పూలే అంబేద్కర్ విగ్రహాల ముందు బీసీల మౌన దీక్షలు
2) నవంబర్ 13న రాష్ట్రవ్యాప్తంగా సామాజిక న్యాయసాధన కోసం పల్లె నుండి పట్నం వరకు బీసీల ధర్మపోరాట దీక్షలు
3) నవంబర్ 16న రన్ ఫర్ సోషల్ జస్టిస్ పేరుతో రాష్ట్రవ్యాప్తంగా ఆందోళనలు
4) నవంబర్ 18వ తేదీన పార్లమెంటు సభ్యులపై ఒత్తిడి పెంచడానికి ఎంపీలతో బీసీల ములాఖత్
5) నవంబర్ 23న బీసీ రిజర్వేషన్లపై అఖిలపక్ష పార్టీల సమావేశం
6) డిసెంబర్ మొదటి వారంలో బీసీల చలో ఢిల్లీ పార్లమెంటు ముట్టడి
7) డిసెంబర్ మూడోవారం నుండి పల్లె నుండి పట్నం వరకు బీసీల బస్సు యాత్ర
8) జనవరి 4వ వారంలో లక్షల మందితో వేలవృత్తులు– కోట్ల గొంతులు నినాదంతో హైదరాబాద్‌లో భారీ బహిరంగ సభ

# దమ్ముంటే బియ్యం ఆపి చూడు

**మొదటి పేజీ తరువాయిఝ**

ప్రచారంలో రేవంత్ రెడ్డి చేసిన వ్యాఖ్యలను ప్రస్తావిస్తూ.. 'ప్రతి కిలో బియ్యానికి కేంద్రం రూ.42 ఖర్చు చేస్తుండగా, రాష్ట్రం రూ.15 మాత్రమే ఇస్తోంది. ఈ పథకం ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ఆధ్వర్యంలో దేశవ్యాప్తంగా అమలు అవుతోంది. దమ్ము ధైర్యం ఉంటే ముఖ్యమంత్రి ఆ పథకాన్ని ఆపివేయాలి' అని సవాలు విసిరారు. ఈ వ్యాఖ్యలపై బీజేపీ తరఫున ఎన్నికల సంఘానికి ఫిర్యాదు చేశామని కిషన్ రెడ్డి వెల్లడించారు. కాంగ్రెస్ పార్టీ బుజ్జగింపు రాజకీయాలకు పాల్పడుతూ, ఓట్ల కోసం మజ్లిస్‌కు లొంగిపోతోందని కిషన్ రెడ్డి ఆరోపించారు. మెహదీపట్నం, ఎర్రగడ్డ ప్రాంతాలలో శ్మశానవాటికల కోసం విలువైన ప్రభుత్వ రక్షణ స్థలాలను మజ్లిస్ ఒత్తిడితో కేటాయించిన కాంగ్రెస్, ఆలయాలకు స్థలం ఇచ్చేందుకు మాత్రం నిరాకరిస్తోందని విమర్శించారు. ఇది కాంగ్రెస్ విభజన రాజకీయాలకు నిదర్శనం అన్నారు. జాతీయ స్థాయిలో కూడా, కేవలం మజ్లిస్‌ను సంతృప్తి పరచడానికి సోనియా గాంధీ, రాహుల్ గాంధీ మాజీ క్రికెటర్ అజహరుద్దీన్‌కు మంత్రి పదవి ఇవ్వాలని చూస్తున్నారని, ఇది ప్రజల సంక్షేమాన్ని విస్మరించటమే అని ధ్వజమెత్తారు. జూబ్లీహిల్స్ అభివృద్ధి విషయంలో బీఆర్ఎస్, కాంగ్రెస్ ఒకే నాణెం.. రెండు ముఖాలుగా వ్యవహరిస్తున్నాయని కిషన్ రెడ్డి విమర్శించారు. ఈ నియోజకవర్గం లో రోడ్లు గుంతలమయం కావడం, మురికివాడలు, పారిశుద్ధ్యం, డ్రైనేజీ సమస్యలు, వీధి దీపాలు లేకపోవడం వంటి సమస్యలు పాలకుల నిర్లక్ష్యాన్ని చూపుతున్నాయని అన్నారు. "ఓట్ల కోసం అడగడానికి ముందు రేవంత్ రెడ్డి, కేసీఆర్ గుంతల రోడ్లపై రెండు కిలోమీటర్లు నడవాలి" అని ఎద్దేవా చేశారు. హైదరాబాద్‌ను సింగపూర్ లా మారుస్తానని కేసీఆర్ చెప్పి ప్రజలను మోసం చేసి ఫామ్‌హౌస్‌లో గడిపారని విమర్శించారు. అటు.. భారత సైన్యంపై ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చేసిన అభ్యంతరకర వ్యాఖ్యలను కిషన్ రెడ్డి తీవ్రంగా ఖండించారు. రేవంత్‌రెడ్డి, రాహుల్ గాంధీ, గతంలో కేసీఆర్ సైతం సైనికులను కించపరిచేలా మాట్లాడటం వారి సైనిక వ్యతిరేక మనస్తత్వాన్ని చూపిస్తుందని విమర్శించారు. రేవంత్ రెడ్డి వెంటనే బేషరతుగా క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. త్వరలో బీఆర్ఎస్ వైఫల్యాలు, కాంగ్రెస్ మోసాన్ని ప్రజలకు తెలియజేయడానికి బీజేపీ రాష్ట్రవ్యాప్తంగా మహా పాదయాత్రలు నిర్వహిస్తుందని ప్రకటించారు. జూబ్లీహిల్స్‌ను మజ్లిస్ ప్రభావం నుంచి రక్షించి, అభివృద్ధి సాధించడానికి బీజేపీని గెలిపించాలని ఓటర్లకు కిషన్ రెడ్డి విజ్ఞప్తి చేశారు.



# బాహుబలి.. జయహో!

**మొదటి పేజీ తరువాయి**

గణనీయంగా బలోపేతం చేయనుంది. నావికాదళం కార్యాచరణ అవసరాలకు తగినట్లుగా పూర్తిగా స్వదేశీ పరిజ్ఞానంతో అనేక అత్యాధునిక భాగాలను ఇందులో అమర్చారు. సుమారు 4,400 కిలోల బరువున్న ఈ శాటిలైట్, భారతదేశం ప్రయోగించిన కమ్యూనికేషన్ ఉపగ్రహాలలో అత్యంత బరువైనది కావడం విశేషం. ఈ ప్రయోగం విజయవంతం కావడంతో దేశ రక్షణ వ్యవస్థలో మరో కీలక ముందడుగు పడినట్లయింది.

# కాంట్రాక్టర్లకు భారీ జరిమానా

**మొదటి పేజీ తరువాయి**

సవరించామన్నారు. "నిర్దిష్ట ప్రాంతం.. 500 మీటర్ల పరిధిలో ఏడాదిలో ఒకటి కంటే ఎక్కువ ప్రమాదాలు జరిగితే కాంట్రాక్టరుకు రూ.25లక్షల జరిమానా విధిస్తాం. మరుసటి ఏడాది ప్రమాదం జరిగితే ఇది రూ.50లక్షలకు పెరుగుతుంది" అని చెప్పారు. హైవే మంత్రిత్వశాఖ పరిధిలో ఇటువంటి ప్రమాద ముప్పు ఉన్న 3500 ప్రాంతాలు ఉన్నాయన్నారు.

## విద్య, ఉద్యోగవాణి

### బీఎస్‌ఎఫ్‌లో పోస్టులు

మొత్తం పోస్టులు: 391

దరఖాస్తు చివరి తేదీ: నవంబర్ 4, 2025

అర్హత: టెన్త్, ఇంటర్ ఉత్తీర్ణతో పాటు జాతీయ, అంతర్జాతీయ క్రీడల్లో పతకాలు సాధించినవారు అర్హులు.

వయోపరిమితి: 18-23 మధ్య గలవారు

ఎంపిక విధానం: పీఎస్‌టీ, సర్టిఫికెట్ వెరిఫికేషన్, మెడికల్ టెస్ట్, స్పోర్ట్ ప్రదర్శన ఆధారంగా..

# అంత ధైర్యముందా?

**మొదటి పేజీ తరువాయి**

ప్రశ్నించారు. ఆదివారం ఆయన హైదరాబాద్‌లో మీడియా సమావేశంలో మాట్లాడుతూ.. ఢిల్లీ, ఉత్తరప్రదేశ్‌లలో తనను దాటి బుల్డోజర్లు వెళ్లాలని సవాల్ విసిరిన రాహుల్ గాంధీ, తెలంగాణలో జరుగుతున్న అన్యాయాలను ఎందుకు పట్టించుకోవడం లేదని నిలదీశారు. హైదరాబాద్ డిజాస్టర్ రెస్పాన్స్ అండ్ అసెట్ ప్రొటెక్షన్ ఏజెన్సీ (హైడ్రా) చేపడుతున్న కూల్చివేతలపై కేటీఆర్ ఒక ప్రత్యేక ప్రజెంటేషన్ ఇచ్చారు. ఈ సందర్భంగా రాహుల్ గాంధీ గతంలో ఢిల్లీలో మాట్లాడిన పాత వీడియో క్లిప్‌ను ప్రదర్శించారు. "ధనికులకు ఒక న్యాయం, పేదలకు మరో న్యాయం" అనే నినాదంతో ఈ ప్రజెంటేషన్ సాగింది. ప్రభుత్వ చర్యల వల్ల నష్టపోయిన పలువురు బాధితులు కూడా ఈ సమావేశంలో తమ గోడును వెళ్లబోసుకున్నారు. హైడ్రా పేరుతో ప్రభుత్వం రాజధానిలో అరాచకం సృష్టిస్తోందని, దీనివల్ల ఎంతోమంది నిరాశ్రయులవుతున్నారని కేటీఆర్ ఆరోపించారు. కాంగ్రెస్ ప్రభుత్వం ధనికులను వదిలేసి, పేదలపైనే ప్రతాపం చూపిస్తోందని కేటీఆర్ విమర్శించారు. చెరువులను కబ్జా చేసి ఓ రెవెన్యూ మంత్రి ఇల్లు కట్టుకున్నారని, హిమాయత్ సాగర్ సమీపంలో మరో మంత్రి వివేక్ నిర్మాణాలు చేపట్టారని ఆరోపించారు. దుర్గం చెరువు ఎఫ్‌టీఎల్‌లో సీఎం రేవంత్ రెడ్డి సోదరుడు తిరుపతి రెడ్డి ఇల్లు కట్టుకున్నా హైడ్రా అధికారులు అటువైపు కన్నెత్తి చూడలేదని అన్నారు. "పేదలు కోర్టుకు వెళ్లే సమయం కూడా ఇవ్వకుండా ఇళ్లు కూల్చేస్తున్నారు. కానీ, సీఎం సోదరుడికి మాత్రం కోర్టుకు వెళ్లి స్టే తెచ్చుకునే అవకాశం కల్పించారు. ఇదేనా మీ న్యాయం?" అని కేటీఆర్ ప్రశ్నించారు. ఎమ్మెల్సీ పట్నం మహేందర్ రెడ్డి చెరువు మధ్యలో ఇల్లు కట్టినా నోటీసులు ఇచ్చే ధైర్యం కూడా హైడ్రాకు లేదని ఆయన ఎద్దేవా చేశారు. గత పదేళ్ల కేసీఆర్ పాలనలో రాష్ట్రవ్యాప్తంగా నిర్మాణాలు జరిగాయని కేటీఆర్ గుర్తుచేశారు. "హైదరాబాద్‌లోనే లక్ష డబుల్ బెడ్‌రూం ఇళ్లు కట్టించాం. వైట్‌హౌస్‌తో పోటీపడేలా సచివాలయం నిర్మించాం. దేశంలోనే అతిపెద్ద పోలీస్ కమాండ్ కంట్రోల్ సెంటర్‌ను ఏర్పాటు చేశాం. 42



ఫ్లైఓవర్లు, అండర్‌పాస్‌లు, ప్రతి జిల్లాలో కలెక్టరేట్లు, భారీ సాగునీటి ప్రాజెక్టులు పూర్తిచేశాం. కానీ, ఈ రెండేళ్లలో రేవంత్ రెడ్డి సర్కార్ చేసింది కేవలం కూల్చివేతలే" అని ఆయన దుయ్యబట్టారు. కూల్చివేతల సందర్భంగా ఒక గర్భిణిని తోసేశారని, మూడు సంవత్సరాల చిన్నారి ఆకలితో అలమటించిందని చెబుతూ సంబంధిత ఫొటోలు, వీడియోలను ప్రదర్శించారు. ఇంకో 500 రోజుల్లో తెలంగాణలో మళ్లీ కేసీఆర్ నేతృత్వంలోని ప్రభుత్వం అధికారంలోకి వస్తుందని కేటీఆర్ ధీమా వ్యక్తం చేశారు. తాము అధికారంలోకి వచ్చాక బాధితులందరికీ తప్పకుండా న్యాయం చేస్తామని హామీ ఇచ్చారు.

# కాంగ్రెస్‌కు నిద్రలేని రాత్రులు

## ఆపరేషన్ సిందూర్‌తో కోలుకోలేకపోతోంది.. బీహార్ ఎన్నికల ప్రచారంలో ప్రధాని మోదీ



పాట్నా: 'ఆపరేషన్ సిందూర్' షాక్ నుంచి పాకిస్థాన్, కాంగ్రెస్ ఇంకా కోలుకోలేకపోయాయని ప్రధాని నరేంద్ర మోదీ పేర్కొన్నారు. ఆ ఆపరేషన్ సమయంలో దాయాది దేశంలో ఉగ్రస్థావరాలపై బాంబులు పడుతుంటే.. ఇక్కడ కాంగ్రెస్ రాజకుటుంబం నిద్రలేని రాత్రులు గడిపిందన్నారు. బీహార్ అసెంబ్లీ ఎన్నికల నేపథ్యంలో ఆరాలో నిర్వహించిన ప్రచార సభలో ప్రతిపక్షాలపై ప్రధాని మోదీ విరుచుకుపడ్డారు. 'జంగల్‌రాజ్'ను బిహార్ ప్రజలు మర్చిపోలేదని, ఆ నేతలు చరిత్రలోనే అత్యంత దారుణమైన ఓటమిని చవిచూడబోతున్నారని చెప్పారు. 'ఆర్జేడీకి అనుకూలంగా సీఎం అభ్యర్థిని ప్రకటించాలని కాంగ్రెస్ అనుకోలేదు. తేజస్వీ యాదవ్‌ను ముఖ్యమంత్రి అభ్యర్థిగా అంగీకరించేందుకు హస్తం పార్టీ ఎప్పుడూ సిద్ధంగా లేదు. కానీ.. కాంగ్రెస్ తలపై తుపాకీ ఎక్కుపెట్టి మరీ ఆర్జేడీ ఆ అవకాశాన్ని దక్కించుకుంది. ఎన్నికల అనంతరం ఆ పార్టీల నేతలు పరస్పరం పోట్లాడుకుంటారు. మహా కుంభమేళాను ఇరు పార్టీల నేతలు అవమానించారు. ఓ కాంగ్రెస్ నేత ఛఠ్ పూజను అపహాస్యం చేశారు. ఇకపై ఎవరూ అలా చేసేందుకు ధైర్యం చేయనంతగా వారికి గుణపాఠం నేర్పాలి. జాతీయ భద్రత, సైన్యానికి మా ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యం ఇస్తోంది. వన్ ర్యాంక్ వన్ పెన్షన్‌ను అమలు చేస్తోంది. జమ్మూకశ్మీర్‌లో ఆర్టికల్ 370ని రద్దు చేశాం. ఉగ్రవాదులను వారి గడ్డపైనే శిక్షించాలని ప్రతిజ్ఞ చేశాం. ఆపరేషన్ సిందూర్ రూపంలో దాన్ని నెరవేర్చాం. పొరుగు దేశంలోని ఉగ్రస్థావరాలపై దాడులు చేస్తున్నప్పుడు.. కాంగ్రెస్ రాజకుటుంబానికి నిద్ర కరవైంది. 'ఆపరేషన్ సిందూర్' షాక్ నుంచి పాక్, కాంగ్రెస్‌లు ఇంకా కోలుకోలేదు' అని మోదీ పేర్కొన్నారు. ఇందిరా గాంధీ హత్య అనంతరం చెలరేగిన హింసను ప్రస్తావిస్తూ.. '1984లో దాదాపు ఇదే సమయంలో దిల్లీలో సిక్కులను ఊచకోత కోశారు. ఈ మారణహోమం విషయంలో కాంగ్రెస్ ఇంకా క్షమాపణ చెప్పలేదు. దోషులను ప్రోత్సహిస్తోంది' అని ఆరోపించారు. రాహుల్ గాంధీ చేపట్టిన 'ఓటరు అధికార్ యాత్ర'ను పరోక్షంగా ఉటంకిస్తూ.. చొరబాటుదారులను కాపాడేందుకే ఈ ర్యాలీ నిర్వహించారని, వారిని తరిమికొట్టాలన్నారు. ఎన్డీయే మేనిఫెస్టోలో నిజాయతీ, దార్శనికత కనిపిస్తోందని, ప్రతిపక్షాల హామీల పత్రం మొత్తం అబద్ధాలతో నిండి ఉందని విమర్శించారు.



## చేపలు పట్టిన రాహుల్ గాంధీ

పాట్నా: బీహార్ ఎన్నికలు దగ్గరపడుతుండడంతో పార్టీలు ప్రచారాన్ని ముమ్మరం చేశాయి. ఓటర్లను ఆకట్టుకునేందుకు తీవ్రంగా శ్రమిస్తున్నాయి. మొదటి దశ పోలింగ్‌కు గడువు సమీపిస్తున్న వేళ.. కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ తన ప్రచారంలో దూకుడు పెంచారు. ఆదివారం బెగుసరాయ్ జిల్లాలో ఆయన ర్యాలీ నిర్వహించారు. ఈ క్రమంలో ఆయన మత్స్యకారులను కలిశారు. మత్సకారులతో పాటు చెరువులోకి దూకడంతో అంతా ఆశ్చర్యపోయారు. బెగుసరాయ్‌లోని మత్స్యకారులు నిర్వహించిన సమావేశంలో రాహుల్ గాంధీ పాల్గొన్నారు. అక్కడ ఆయన కేవలం ప్రసంగించడం కాకుండా మత్స్యకారులతో కలిసి చేపలు పట్టారు. ఈయనతో పాటు వీఐపీ చీఫ్ ముఖేష్ సాహ్ని, కాంగ్రెస్ నాయకులు కన్హయ్య కుమార్ కూడా చెరువులోకి దిగారు. ముగ్గురు నాయకులు గ్రామస్తులతో మాట్లాడి.. వాళ్ల కష్టాలు తెలుసుకున్నారు. రాహుల్ గాంధీ స్వయంగా చెరువులోకి దిగి. వల వేసి చేపలు పట్టడం చూసిన అక్కడి ప్రజలంతా అవాక్కయ్యారు. తాము ఇంతకు ముందెన్నడూ ఇలాంటి నాయకుడిని చూడలేదని అన్నారు. లోక్‌సభ ప్రతిపక్ష నేత ఇలా చేయడం తమకు గర్వకారణమన్నారు. ఈ సందర్భంగా రాహుల్ గాంధీకి మద్దతుగా నినాదాలు చేశారు. ఈ వీడియోను కాంగ్రెస్ పార్టీ సోషల్ మీడియాలో షేర్ చేయగా.. అది వైరల్‌గా మారింది. ఈ సందర్భంగా మహా కూటమి మత్స్యకారులకు ఇచ్చిన హామీలను కూడా పార్టీ వెల్లడించింది.



# విద్యార్థినులపై జులుం

## షాద్‌నగర్‌లో తీవ్ర ఉద్రిక్తత.. ప్రిన్సిపాల్ వేధింపులపై విద్యార్థినుల ఆందోళన

**షాద్‌నగర్ చౌరస్తాలో ధర్నాతో ఉద్రిక్తత.. మహిళా కానిస్టేబుల్‌పై చేయిచేసుకున్న విద్యార్థినులు**

**పోలీసులు, విద్యార్థినుల మధ్య వాగ్వాదం, తోపులాట.. విద్యార్థినులను అదుపులోకి తీసుకున్న పోలీసులు**



షాద్‌నగర్, నవంబర్ 2 (ఈవార్తలు): రంగారెడ్డి జిల్లా షాద్‌నగర్ పట్టణంలో తీవ్ర ఉద్రిక్తత చోటుచేసుకుంది. స్థానిక ప్రభుత్వ సాంఘిక సంక్షేమ గురుకుల డిగ్రీ కళాశాల విద్యార్థినులు చేపట్టిన ఆందోళన ఘర్షణకు దారితీసింది. ప్రిన్సిపల్ అక్రమాలకు పాల్పడుతున్నారని, తమను వేధిస్తున్నారని ఆరోపిస్తూ విద్యార్థినులు పట్టణ చౌరస్తాలో ధర్నాకు దిగారు. ఈ క్రమంలో ఆందోళనను అదుపు చేసేందుకు యత్నించిన ఓ మహిళా కానిస్టేబుల్‌పై విద్యార్థినులు దాడి చేశారు. వివరాల్లోకి వెళితే, కళాశాల ప్రిన్సిపల్‌పై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తూ విద్యార్థినులు రోడ్డుపై బైఠాయించి నిరసన తెలిపారు. విషయం తెలుసుకున్న పోలీసులు అక్కడికి చేరుకుని వారికి నచ్చజెప్పి ఆందోళన విరమింపజేసేందుకు ప్రయత్నించారు. ఈ సమయంలో ఓ మహిళా కానిస్టేబుల్‌కు, విద్యార్థినులకు మధ్య వాగ్వాదం జరిగింది. ఈ క్రమంలో ఆమె ఓ విద్యార్థినిపై చేయి చేసుకోవడంతో పరిస్థితి అదుపుతప్పింది. ఆగ్రహానికి గురైన తోటి విద్యార్థినులు ఏకమై మహిళా కానిస్టేబుల్‌పై తిరగబడ్డారు. 'న్యాయం చేయాలని అడిగితే మమ్మల్నే కొడతారా?' అంటూ పోలీసులను నిలదీశారు. ఈ అనూహ్య పరిణామంతో పోలీసులు, స్థానికులు నిశ్చేష్టులయ్యారు. జిల్లా కలెక్టర్ స్వయంగా వచ్చి తమ సమస్యలు విని, పరిష్కారం చూపే వరకు ఆందోళన విరమించేది లేదని విద్యార్థినులు తేల్చిచెప్పారు. పరిస్థితి ఉద్రిక్తంగా మారడంతో పోలీసులు కొందరు విద్యార్థినులను బలవంతంగా వాహనంలోకి ఎక్కించి అక్కడి నుంచి తరలించారు. ఈ ఘటనతో షాద్‌నగర్ పట్టణంలో ఉద్రిక్త వాతావరణం నెలకొంది. విద్యార్థినుల ఆరోపణలపై ఉన్నతాధికారులు విచారణ జరిపి, ప్రిన్సిపల్‌పై చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు. ఈ ఆందోళన కారణంగా జాతీయ రహదారిపై కూడా కాసేపు ట్రాఫిక్‌కు అంతరాయం ఏర్పడింది.

## దొంగతనాల్లో ప్రియురాలే పార్ట్‌నర్!

మేడిపల్లి (హైదరాబాద్), నవంబర్ 2 (ఈవార్తలు): మేడిపల్లి పోలీస్ స్టేషన్ పరిధిలో ఒక పాత నేరస్థుడు, తన ప్రియురాలితో కలిసి చోరీలకు పాల్పడటం స్థానికంగా కలకలం రేపింది. ఒకే రాత్రి ఒక బైక్‌ను అపహరించడంతో పాటు, తాళం వేసి ఉన్న మరో ఇంట్లో చొరబడి బంగారం, నగదును దోచుకెళ్లారు. సీసీటీవీ ఫుటేజీ ఆధారంగా పోలీసులు నిందితులను గుర్తించి, వారి కోసం గాలింపు చర్యలు ముమ్మరం చేశారు. వివరాల్లోకి వెళితే, బోడుప్పల్ సాయిరాంనగర్ కాలనీకి చెందిన శ్రీకాంత్ తన బైక్‌ను ఇంటి ముందు పార్క్ చేశారు. ఉదయం చూసేసరికి బైక్ కనిపించకపోవడంతో అనుమానం వచ్చి స్థానిక సీసీ కెమెరాలను పరిశీలించారు. తెల్లవారుజామున 3:39 గంటల సమయంలో ఒక జంట ఆ బైక్‌ను నెట్టుకుంటూ తీసుకెళ్తున్న దృశ్యాలు కెమెరాల్లో రికార్డయ్యాయి. ఇదే ప్రాంతంలో నివసించే ప్రవీణ్‌కుమార్ అనే ప్రైవేటు ఉద్యోగి తన కుటుంబంతో కలిసి యాదగిరిగుట్టకు వెళ్లారు. దీనిని అదునుగా భావించిన దొంగలు, తాళం పగలగొట్టి ఇంట్లోకి ప్రవేశించారు. బీరువాలో ఉన్న తులం బంగారు నగలు, రూ.60 వేల నగదును అపహరించారు. ఈ రెండు ఘటనలపై ఫిర్యాదు అందుకున్న పోలీసులు దర్యాప్తు చేపట్టారు. సీసీ ఫుటేజీ ఆధారంగా విచారణ జరిపిన పోలీసులకు నిందితుడు పాత నేరస్థుడు సుధాకర్ అని తేలింది. అతడు తరచూ తన ప్రియురాలితో కలిసి ఇలాంటి దొంగతనాలకు పాల్పడతాడని పోలీసులు గుర్తించారు.

## హైదరాబాద్‌లో పలు చోట్ల భారీ వర్షం

హైదరాబాద్, నవంబర్ 2 (ఈవార్తలు): నగరంలోని పలు ప్రాంతాల్లో ఆదివారం సాయంత్రం భారీ వర్షం కురిసింది. కుత్బుల్లాపూర్, బహదూర్‌పల్లి, జీడిమెట్ల, లింగంపల్లి, కూకట్‌పల్లి, సికింద్రాబాద్, జూబ్లీహిల్స్, మాదాపూర్, పంజాగుట్ట తదితర ప్రాంతాల్లో కురిసిన వర్షానికి రహదారుల జలమయమయ్యాయి. దీంతో వాహనదారులు ఇబ్బందులు ఎదుర్కొన్నారు. పలు చోట్ల ట్రాఫిక్‌కు అంతరాయం ఏర్పడింది. రహదారులపై వాహనాలు నెమ్మదిగా కదులుతున్నాయి.



# నెత్తుటి దారి

**రాజస్థాన్‌లోని జోధ్‌పూర్‌లో ఘోర రోడ్డు ప్రమాదం**

**ఆగి ఉన్న ట్రక్కును ఢీకొట్టిన యాత్రికుల టెంపో ట్రావెలర్**

**ఈ దుర్ఘటనలో 18 మంది అక్కడికక్కడే మృతి**

**మరో ఆరుగురికి తీవ్ర గాయాలు, ఆసుపత్రికి తరలింపు**

జోధ్‌పూర్: రాజస్థాన్‌లో ఆదివారం ఘోర రోడ్డు ప్రమాదం జరిగింది. జోధ్‌పూర్ జిల్లాలో యాత్రికులతో వెళుతున్న ఓ టెంపో ట్రావెలర్, రోడ్డు పక్కన ఆగి ఉన్న ట్రక్కును బలంగా ఢీకొట్టింది. ఈ దుర్ఘటనలో 18 మంది అక్కడికక్కడే మృతి చెందగా, మరో ఆరుగురు తీవ్రంగా గాయపడ్డారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం, జోధ్‌పూర్‌లోని సుర్‌సాగర్ ప్రాంతానికి చెందిన కొందరు యాత్రికులు బికనీర్ జిల్లాలోని కొలాయత్ జాతరకు వెళ్లి టెంపో ట్రావెలర్‌లో తిరిగి వస్తున్నారు. ఈ క్రమంలో ఫలోడి సబ్-డివిజన్‌లోని మటోడా ప్రాంతం సమీపంలో ఈ ప్రమాదం చోటుచేసుకుంది. ప్రమాద సమయంలో వాహనం అతివేగంతో ఉన్నట్లు ప్రాథమిక దర్యాప్తులో తేలింది. తెల్లవారుజామున వెలుతురు తక్కువగా ఉండటంతో డ్రైవర్ రోడ్డు పక్కన నిలిపి ఉంచిన ట్రక్కును గమనించలేకపోయి ఉంటారని పోలీసులు భావిస్తున్నారు. ప్రమాదం ఎంత తీవ్రంగా ఉందంటే, టెంపో ట్రావెలర్ ముందు భాగం పూర్తిగా నుజ్జునుజ్జయింది. సమాచారం అందుకున్న వెంటనే స్థానికులు, పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని సహాయక చర్యలు చేపట్టారు. గాయపడిన వారిని సమీపంలోని ఆసుపత్రికి తరలించగా, మృతదేహాలను పోస్ట్‌మార్టం నిమిత్తం తరలించారు. మృతులను గుర్తించి, వారి కుటుంబ సభ్యులకు సమాచారం అందించే ప్రయత్నాలు జరుగుతున్నాయి. ఈ దుర్ఘటనపై రాజస్థాన్ ముఖ్యమంత్రి భజన్ లాల్ శర్మ తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. "ఫలోడిలోని మటోడా ప్రాంతంలో జరిగిన రోడ్డు ప్రమాదంలో ప్రాణనష్టం జరగడం అత్యంత విషాదకరం, హృదయ విదారకం. మృతుల కుటుంబాలకు నా ప్రగాఢ సానుభూతి. గాయపడిన వారందరికీ మెరుగైన చికిత్స అందించాలని జిల్లా పరిపాలన అధికారులను ఆదేశించాను. మృతుల ఆత్మకు శాంతి చేకూరాలని, గాయపడిన వారు త్వరగా కోలుకోవాలని భగవంతుడిని ప్రార్థిస్తున్నాను" అని ఆయన 'ఎక్స్'లో పేర్కొన్నారు. ఈ ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు. ప్రమాదానికి గల కచ్చితమైన కారణాలను తెలుసుకునేందుకు రెండు వాహనాలకు మెకానికల్ పరీక్షలు నిర్వహించనున్నట్లు అధికారులు తెలిపారు.

## బీబీ నగర్ వద్ద రోడ్డు ప్రమాదంలో ఇద్దరు మృతి

బీబీనగర్, నవంబర్ 2 (ఈవార్తలు): యాదాద్రి భువనగిరి జిల్లాలో విషాదకర రోడ్డు ప్రమాదం జరిగింది. బీబీ నగర్ చెరువుకట్టపై ఒక థార్ వాహనం బీభత్సం సృష్టించి ఇద్దరి ప్రాణాలను బలిగొంది. అతివేగంతో అదుపుతప్పిన వాహనం పాదచారులపైకి దూసుకెళ్లడంతో ఈ దుర్ఘటన సంభవించింది. వివరాల్లోకి వెళితే, బీబీ నగర్‌లోని చెరువుకట్టపై వేగంగా వస్తున్న ఒక థార్ వాహనం అకస్మాత్తుగా అదుపుతప్పింది. దీంతో అక్కడ ఉన్న పలువురిని ఢీకొట్టింది. ఈ దుర్ఘటనలో ఒక యువకుడు అక్కడికక్కడే తీవ్ర గాయాలతో మృతి చెందాడు. అదే సమయంలో వాహనం ఢీకొట్టిన ధాటికి మరో యువతి సమీపంలోని చెరువులో పడిపోయింది. నీటిలో మునిగి ఆమె కూడా ప్రాణాలు కోల్పోయింది. ఈ అనూహ్య ఘటనతో చెరువుకట్ట ప్రాంతంలో ఒక్కసారిగా భయాందోళన వాతావరణం నెలకొంది. స్థానికుల సమాచారంతో పోలీసులు వెంటనే ఘటనాస్థలానికి చేరుకున్నారు. మృతదేహాలను వెలికితీసి పోస్టుమార్టం నిమిత్తం ఆసుపత్రికి తరలించారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు. అతివేగమే ప్రమాదానికి కారణమని ప్రాథమికంగా పోలీసులు భావిస్తున్నారు.

# 500కే రూ.16 లక్షల ఇల్లు సొంతం



చౌటుప్పల్, నవంబర్ 2 (ఈవార్తలు): ఓ వ్యక్తి తన ఇంటి స్థలం విక్రయానికి చేసిన వినూత్న ఆలోచన స్థానికులను.. ఔరా! అనిపించింది. యాదాద్రి భువనగిరి జిల్లా చౌటుప్పల్‌లో నిర్వహించిన లక్కీ డ్రాలో ఓ కుటుంబం రూ.16 లక్షల విలువైన ఇంటిని సొంతం చేసుకుంది. లాటరీ విధానం రాష్ట్రంలో చట్టబద్ధం కాకున్నా.. ఇంటి యజమాని వినూత్న ఆలోచన స్థానికులను ఆకర్షించింది. దీంతో ఆశావహులు తమ అదృష్టాన్ని పరీక్షించుకోగా.. ఇంటి యజమానికి ఆశించిన దానికంటే ఎక్కువ లాభం సమకూరింది. యాదాద్రి భువనగిరి జిల్లా చౌటుప్పల్‌లో రేకుల గదితో సహా 66 గజాల ఇంటి స్థలం అమ్మకానికి లక్కీడ్రా పద్ధతి పెట్టారు యజమాని కంచర్ల రామబ్రహ్మం. కొనుగోలుకు ఆసక్తి ఉన్నవారు రూ.500 విలువైన కూపన్‌ను కొనుగోలు చేసి లక్కీడ్రాలో పాల్గొనాలని జాతీయ రహదారి పక్కన, ఆ ఇంటి వద్ద ఫ్లెక్సీలు కట్టారు. "స్థానిక మార్కెట్ ధర ప్రకారం ఈ స్థలం, గది విలువ రూ.16 లక్షలు ఉంటుంది. 3,000 కూపన్లు ముద్రించా. వాటిని కొనుగోలు చేసిన వారు దానిపై తమ వివరాలు రాసి ఆ ఇంటి వద్ద ఏర్పాటు చేసిన డబ్బాలో వేయాలి. నవంబరు 2న లక్కీడ్రా తీస్తా" అని ప్రకటించాడు. ఆలోచన కొత్తగా ఉందని ఈ సమాచారం సోషల్ మీడియాలో వైరల్ అయింది. విషయం తెలుసుకున్న సంగారెడ్డి జిల్లా శంకర్‌పల్లికి చెందిన శంకర్ తన కుటుంబ సభ్యుల నలుగురి పేర్ల మీద నాలుగు కూపన్లు కొన్నాడు. ముందుగా ప్రకటించిన విధంగా ఆదివారం రోజున కూపన్లు కొనుగోలు చేసిన వారి సమక్షంలోనే లక్కీ డ్రా తీశారు. చౌటుప్పల్ పురపాలిక పరిధి లింగారెడ్డి గూడెంలోని జియన్ రెడ్డి ఫంక్షన్ హాల్‌లో లక్కీ డ్రా నిర్వహింగా.. శంకర్ కుమార్తె హన్సిక(10నెలలు)ను అదృష్టం వరించింది. రూ.16లక్షల విలువైన ఇంటిని ఆమె లక్కీడ్రాలో గెలుచుకుంది. 2307 సీరియల్ నెంబర్‌తో కూపన్ కొనుగోలు చేసిన హన్సిక తల్లిదండ్రులకు చరవాణి ద్వారా నిర్వాహకుడు సమాచారాన్ని అందించారు. ఆమె కోరిన సమయంలో రిజిస్ట్రేషన్ చేస్తానని ప్రకటించారు. ఇంటితో సహా 66 గజాల ప్లాటును విక్రయించేందుకు రెండేళ్లు ప్రయత్నించినా అమ్ముడుపోకపోవడంతో ఈ వినూత్న ఆలోచనకు శ్రీకారం చుట్టినట్లు రామబ్రహ్మం తెలిపారు. రూ.500 చొప్పున దాదాపు 3,600 కూపన్లు అమ్ముడు పోయాయని, ఆశించిన దానికన్నా రూ.3 లక్షలు అదనంగా వచ్చాయని ఆనందం వ్యక్తం చేశారు. శంకర్, భార్య, ఇద్దరు కుమార్తె.. నలుగురి పేర్లతో కూపన్లు కొనుగోలు చేస్తే.. డ్రాలో చిన్న కుమార్తె హన్సిక ఇల్లు గెలుచుకోవడంతో కుటుంబ సభ్యులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

## తమ్ముడు కిందపడ్డాడని నమ్మించి తీసుకెళ్లి..

# బాలికపై సామూహిక లైంగిక దాడి

**ఖమ్మం జిల్లా కొణిజర్లలో 8వ తరగతి బాలికపై అఘాయిత్యం.. నిందితుల్లో ఇద్దరు మైనర్లు, ఒక మేజర్**

**తల్లిదండ్రుల ఫిర్యాదుతో పోక్సో చట్టం కింద కేసు నమోదు.. ఘటన అనంతరం పరారీలో నిందితులు**



ఖమ్మం, నవంబర్ 2 (ఈవార్తలు): ఖమ్మం జిల్లాలో అత్యంత దారుణ ఘటన వెలుగుచూసింది. ఒంటరిగా వెళ్తున్న ఓ బాలికపై ముగ్గురు యువకులు సామూహిక లైంగిక దాడికి పాల్పడ్డారు. నిందితుల్లో ఇద్దరు 16 ఏళ్ల బాలురు కాగా, మరొకరు 18 ఏళ్ల యువకుడు. ఖమ్మం జిల్లా కొణిజర్ల మండలంలో శుక్రవారం రాత్రి ఈ అమానుష ఘటన జరగగా, బాధితురాలి తల్లిదండ్రులు శనివారం పోలీసులకు ఫిర్యాదు చేయడంతో విషయం బయటపడింది. పోలీసుల కథనం ప్రకారం కొణిజర్ల మండలంలోని ఓ గ్రామానికి చెందిన బాలిక 8వ తరగతి చదువుతోంది. శుక్రవారం ఆమె తల్లిదండ్రులు హైదరాబాద్ వెళ్లడంతో, బాలిక తన నాయనమ్మ, తాతయ్యతో కలిసి సమీపంలోని ప్రార్థనా మందిరానికి వెళ్లింది. అక్కడి నుంచి ఇంటికి ఒంటరిగా బయలుదేరిన ఆమెను నిందితుల్లో ఒకడైన బాలుడు మార్గమధ్యలో ఆపాడు. "మీ తమ్ముడు కిందపడిపోయాడు, దెబ్బలు తగిలాయి, వెంటనే రా" అని చెప్పాడు. అతడి మాటలు నమ్మిన బాలికను, ఆ బాలుడు తన స్నేహితుడైన 18 ఏళ్ల యువకుడి ఇంటికి తీసుకెళ్లాడు. అక్కడ అప్పటికే మరో బాలుడు కూడా ఉన్నాడు. అనంతరం ముగ్గురూ కలిసి బాలికపై లైంగిక దాడికి పాల్పడ్డారు. వారి నుంచి తప్పించుకుని ఇంటికి చేరుకున్న బాలిక భయంతో ఆ రాత్రి ఎవరికీ విషయం చెప్పలేదు. శనివారం ఉదయం హైదరాబాద్ నుంచి తల్లిదండ్రులు తిరిగి వచ్చాక, వారికి జరిగిన ఘోరాన్ని వివరించడంతో వారు తీవ్ర దిగ్భ్రాంతికి గురయ్యారు. వెంటనే కొణిజర్ల పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. బాధితురాలి తల్లిదండ్రుల ఫిర్యాదు మేరకు పోలీసులు రంగంలోకి దిగారు. ఒక యువకుడు, ఇద్దరు మైనర్లపై పోక్సో చట్టం కింద కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు. ప్రస్తుతం నిందితులు ముగ్గురూ పరారీలో ఉన్నారని, వారి కోసం గాలిస్తున్నామని పోలీసులు తెలిపారు.

## జాగృతి టీచర్స్ ఫెడరేషన్ నూతన కమిటీ

**ప్రకటించిన కల్వకుంట్ల కవిత**



హైదరాబాద్, నవంబర్ 2 (ఈవార్తలు): తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు, ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత సంస్థాగత నియామకాలపై దృష్టి సారించారు. జాగృతి అనుబంధ విభాగమైన "జాగృతి టీచర్స్ ఫెడరేషన్" నూతన కార్యవర్గాన్ని ఆమె ప్రకటించారు. ఈ మేరకు జాగృతి అధికారిక ఎక్స్ ఖాతా ద్వారా వివరాలను వెల్లడించారు. నూతన కమిటీ అధ్యక్షుడిగా మోరం వీరభద్రరావును, ఉపాధ్యక్షుడిగా బుర్ర రమేష్ గౌడ్‌ను నియమించారు. ప్రధాన కార్యదర్శిగా జాడి శ్రీనివాస్, కోశాధికారిగా ఘనపురం దేవేందర్ బాధ్యతలు చేపట్టనున్నారు. ఈ నియామకాలన్నీ తక్షణమే అమల్లోకి వస్తాయని కవిత స్పష్టం చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. తెలంగాణ సమాజ అభ్యున్నతి, నవ తెలంగాణ నిర్మాణ లక్ష్యంతో తెలంగాణ జాగృతి పనిచేస్తోందని తెలిపారు. కొత్తగా నియమితులైన బాధ్యులు విద్యారంగ అభివృద్ధికి, ఉపాధ్యాయులు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారానికి శక్తివంచన లేకుండా కృషి చేయాలని ఆకాంక్షించారు. రాష్ట్రంలో విద్యా ప్రమాణాల పెంపునకు ఫెడరేషన్ చురుకైన పాత్ర పోషించాలని ఆమె సూచించారు.

### భీమన్న గుడిలో
# భక్తుల సందడి



వేములవాడ, నవంబర్ 2 (ఈవార్తలు): వేములవాడ శ్రీరాజరాజేశ్వరస్వామివారి ఆలయానికి అనుబంధంగా ఉన్న భీమన్న గుడి ఆదివారం భక్తులతో కిటకిటలాడింది. కార్తీక మాసం కావడంతో రాజన్న భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చి స్వామివారిని దర్శించుకున్నారు. ఆలయ అర్చకులు భీమన్న స్వామివారికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. భక్తులు లఘు దర్శనం ద్వారా రాజరాజేశ్వరస్వామివారిని దర్శించుకున్న అనంతరం భీమన్న ఆలయానికి చేరుకున్నారు. సంప్రదాయం ప్రకారం, భక్తులు భీమన్న ఆలయంలో వారి మొక్కుబడులను, ముఖ్యంగా కోడె మొక్కులను శ్రద్ధతో చెల్లించుకున్నారు. కార్తీక మాసం సందర్భంగా మహిళా భక్తులు అధిక సంఖ్యలో కార్తీక దీపాలను వెలిగించి స్వామి సేవలో తరించారు. దీప కాంతులతో ఆలయ ప్రాంగణం దేదీప్యమానంగా వెలిగింది.

### రాజన్న గుడిలో
## సామూహిక కార్తీక దీపోత్సవం



వేములవాడ, నవంబర్ 2 (ఈవార్తలు): వేములవాడలోని శ్రీ రాజరాజేశ్వర స్వామి దేవస్థానంలో కార్తీక మాసాన్ని పురస్కరించుకుని దేవాదాయ ధర్మాదాయ శాఖ సామూహిక కార్తీక దీపోత్సవాన్ని నిర్వహిస్తోంది. ఈ సందర్భంగా ఆదివారం భీమేశ్వర స్వామి ఆలయ ప్రాంగణంలో జ్యోతి ప్రజ్వలన చేసి సాంస్కృతిక కార్యక్రమాలను ఘనంగా ప్రారంభించారు. భీమేశ్వర స్వామి ఆలయ దేవాలయంలో సేవా సమితి సభ్యులు భక్తి గీతాలు, భజనలతో భక్తులను అలరించారు. కార్తీక మాస పర్వదినాలను పురస్కరించుకుని నిర్వహిస్తున్న ఈ సామూహిక కార్తీక దీపోత్సవ కార్యక్రమం ప్రతి రోజూ సాయంత్రం 6:00 గంటల నుండి రాత్రి 8:00 గంటల వరకు సుహాసినీల ఆధ్వర్యంలో భక్తిశ్రద్ధలతో నిర్వహించనున్నట్లు అధికారులు తెలిపారు.

# జోగి రమేశ్‌ది అక్రమ అరెస్టు

**మాజీమంత్రి అరెస్టుపై జగన్ స్పందన.. ప్రజల దృష్టి మళ్లించేందుకే కుట్రలు.. సిట్ విచారణ ఒక బూటకం అని ఆరోపణ**



తాడేపల్లి, నవంబర్ 2 (ఈవార్తలు): నకిలీ మద్యం కేసులో మాజీ మంత్రి, వైసీపీ నేత జోగి రమేశ్ ను అరెస్టు చేయడంపై ఆ పార్టీ అధినేత జగన్ తీవ్రంగా స్పందించారు. ఇది ముమ్మాటికీ అక్రమ అరెస్టు అని పేర్కొంటూ, ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రభుత్వంపై తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. నకిలీ మద్యం కుంభకోణంలో అడ్డంగా దొరికిపోయి, దాని నుంచి ప్రజల దృష్టి మళ్లించేందుకే నిస్సిగ్గుగా ఇలాంటి కుట్రలకు పాల్పడుతున్నారని ఆయన ఆరోపించారు. "చంద్రబాబు గారూ... మీ నకిలీ మద్యం ఫ్యాక్టరీలు బయటపడ్డ వ్యవహారంలో అడ్డంగా మీరు దొరికిపోయి, దీని నుంచి తప్పించుకోవడానికి నిస్సిగ్గుగా కుట్రలకు పాల్పడుతూ మా పార్టీకి చెందిన బీసీ నాయకుడు, మాజీ మంత్రి జోగిరమేశ్ ను అన్యాయంగా అరెస్టు చేశారు. ముమ్మాటికీ ఇది అక్రమ అరెస్టు. జోగి రమేశ్ అరెస్టును తీవ్రంగా ఖండిస్తున్నాను. గత 18 నెలలుగా ప్రభుత్వం మీది, పాలన మీది. పట్టుబడ్డ నకిలీ మద్యం మీ హయాంలోనిది. పట్టుబడ్డవారిలో మీ పార్టీనుంచి ఎన్నికల్లో పోటీచేసిన ఎమ్మెల్యే అభ్యర్థి మొదలు, మీతోనూ, మీ కొడుకుతోనూ, మీ మంత్రులతోనూ, మీ ఎమ్మెల్యేలతోనూ, అత్యంత సన్నిహిత సంబంధాలు కలిగినవారే ఉన్నారు. మీరు తయారు చేసిన మీ నకిలీ మద్యాన్ని అంతా అమ్మేది, మీరు తీసుకు వచ్చిన మీ ప్రైవేటు లిక్కర్ షాపుల్లోనే, మీ కార్యకర్తలు, నాయకులు నడిపే బెల్టుషాపుల్లోనే, పర్మిట్ రూముల్లోనే. మరి తయారీ మీది, చేసిన వారు మీవారు, అమ్మేదీ మీరే, కాని బురదజల్లేది, అక్రమ అరెస్టులు చేసేది మాత్రం మావాళ్లని. నిన్న కాశీబుగ్గ ఆలయంలో తొక్కిసలాటకు కారణమైన ప్రభుత్వ వైఫల్యాల నుంచి దృష్టిమళ్లించడానికి, మొంథా తుపాను కారణంగా కుదేలైన రైతు గోడును పక్కదోవపట్టించడానికి ఈ అక్రమ అరెస్టుకు పాల్పడి, దుర్మార్గానికి ఒడిగట్టారు. నకిలీ మద్యం వ్యవహారంపై సీబీఐ విచారణ జరిపించాలంటూ జోగి రమేశ్ హైకోర్టులో పిటిషన్ వేసిన మరుసటిరోజే అరెస్టుకు దిగారంటే చంద్రబాబుగారూ.. మీరు ఎంతగా భయపడుతున్నారో అర్థం అవుతోంది. నకిలీ మద్యం వ్యవహారంలో మీ ప్రమేయం, మీ మనుషుల ప్రమేయం లేకపోతే సీబీఐ చేత విచారణకు భయమెందుకు చంద్రబాబు గారూ? ఎందుకు వెనకడుగు వేస్తున్నారు? మీ జేబులో ఉన్న సిట్ మీరు ఏం చెబితే అది చేస్తుంది. మీరు సిట్ అంటే సిట్.. స్టాండ్ అంటే స్టాండ్. మీ మాఫియా వ్యవహారాల మీద మీరే విచారణ చేయించడం హాస్యాస్పదం కాదా? ఇలాంటి రాక్షస పాలనలో మీ నుంచి ఏమి ఆశించగలం?" అంటూ జగన్ ట్వీట్ చేశారు.

## కాశీబుగ్గ మృతుల కుటుంబాలకు
# పరిహారం అందజేత

కాశీబుగ్గ, నవంబర్ 2 (ఈవార్తలు): శ్రీకాకుళం జిల్లా కాశీబుగ్గలోని ఆలయంలో జరిగిన తొక్కిసలాట ఘటనలో మృతిచెందిన వారి కుటుంబాలకు ప్రభుత్వం పరిహారం అందజేసింది. టెక్కలి నియోజకవర్గం పరిధి నందిగాం మండలం పిట్టలిసరియా, రామేశ్వరం, శివరాంపురం గ్రామానికి చెందిన మృతుల కుటుంబాలకు రూ.15లక్షల చొప్పున పరిహారాన్ని కేంద్రమంత్రి రామ్మోహన్‌నాయుడు, రాష్ట్ర మంత్రి అచ్చెన్నాయుడు అందించారు. అనంతరం అచ్చెన్నాయుడు మాట్లాడుతూ తొక్కిసలాట ఘటన తీవ్రంగా కలిచివేసిందన్నారు. మృతుల కుటుంబాలకు అండగా ఉంటామని.. ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా చర్యలు చేపడతామని చెప్పారు. త్వరలో కేంద్ర ప్రభుత్వం నుంచి మరో రూ.2 లక్షల ఆర్థిక సాయం అందుతుందని రామ్మోహన్‌నాయుడు తెలిపారు. ధైర్యంగా ఉండాలని, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అండగా ఉంటాయని భరోసా ఇచ్చారు. కాశీబుగ్గలోని వేంకటేశ్వరస్వామి ఆలయంలో శనివారం జరిగిన తొక్కిసలాటలో తొమ్మిది మంది మరణించగా, 25 మంది తీవ్రంగా గాయపడిన విషయం తెలిసిందే. మృతుల్లో ఎనిమిది మంది మహిళలు, ఓ బాలుడు ఉన్నారు. కార్తిక ఏకాదశి సందర్భంగా స్వామి దర్శనానికి భక్తులు పోటెత్తడంతో ఉదయం నుంచి ఆలయం కిటకిటలాడింది. భక్తులంతా ఒకేసారి ఆలయంలోకి ప్రవేశించే క్రమంలో ఉదయం 11.45 గంటలకు తోపులాట జరిగి.. అది తొక్కిసలాటకు దారితీసింది.

# డీఎంకే భేటీకి విజయ్ డుమ్మా

**ఓటర్ల జాబితా సవరణ రాజ్యాంగ విరుద్ధమని ఆరోపణ**

**మైనారిటీ ఓట్లను తొలగించే ప్రమాదం ఉందన్న విజయ్**



చెన్నై: తమిళనాడులో అధికార డీఎంకే పార్టీకి, నటుడు, తమిళగ వెట్రి కళగం (టీవీకే) అధ్యక్షుడు విజయ్‌కు మధ్య రాజకీయ వేడి రాజుకుంది. ఓటర్ల జాబితా ప్రత్యేక సవరణపై చర్చించేందుకు డీఎంకే ప్రభుత్వం ఆదివారం ఏర్పాటు చేసిన అఖిలపక్ష సమావేశాన్ని విజయ్ బహిష్కరించారు. ఈసీ చేపట్టిన ఈ సవరణ ప్రక్రియ పూర్తిగా "రాజ్యాంగ విరుద్ధం, రాజకీయ ప్రేరేపితం, ప్రజాస్వామ్యానికి పెను ముప్పు" అని ఆయన తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. ఈ మేరకు విజయ్ ఒక ఘాటైన ప్రకటన విడుదల చేశారు. ప్రస్తుతం జరుగుతున్న ఓటర్ల జాబితా సవరణ వల్ల గతంలో బీహార్‌లో జరిగినట్లే తమిళనాడులో కూడా లక్షలాది మంది మైనారిటీ ఓటర్లను జాబితా నుంచి తొలగించే ప్రమాదం ఉందని ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. కేవలం 30 రోజుల వ్యవధిలో రాష్ట్రంలోని 6.36 కోట్ల మంది ఓటర్ల వివరాలను ఎలా ధృవీకరిస్తారని ఎన్నికల సంఘాన్ని ప్రశ్నించారు. ఈసీ చర్యల్లో పారదర్శకత, నిష్పక్షపాత వైఖరి లోపించాయని, ఇంతటి హడావుడి ప్రక్రియ ప్రజల ప్రాథమిక ప్రజాస్వామ్య హక్కులను కాలరాయడమేనని అన్నారు. డీఎంకే ప్రభుత్వంపై కూడా విజయ్ తీవ్ర విమర్శలు చేశారు. వారిపై ఉన్న అవినీతి ఆరోపణల నుంచి ప్రజల దృష్టిని మళ్లించేందుకే డీఎంకే ఈ అఖిలపక్ష సమావేశ నాటకానికి తెరలేపిందని ఆరోపించారు. "ఈసీ నిర్ణయాన్ని నిజంగా వ్యతిరేకిస్తే, కేరళ అసెంబ్లీలో తీర్మానం చేసినట్లుగా డీఎంకే ప్రభుత్వం ఎందుకు చేయలేదు? ఈ సమావేశం ప్రజలను తప్పుదోవ పట్టించేందుకు ఆడుతున్న ఓ మోసపూరిత రాజకీయ నాటకం" అని ఆయన అభివర్ణించారు. పారదర్శకమైన ఓటర్ల జాబితా కోసం విజయ్ ఏడు కీలక సూచనలను కూడా ప్రతిపాదించారు. జాబితాలోని తప్పులను సరిదిద్దడం, నకిలీ ఓట్లను తొలగించడం, అర్హులైన ప్రతి ఒక్కరినీ చేర్చడం, వయస్సు-చిరునామా ధృవీకరణకు ఆధార్ కార్డును అంగీకరించడం, తుది జాబితాను రాజకీయ పార్టీలకు, ప్రజలకు డిజిటల్‌గా అందుబాటులో ఉంచడం వంటివి ఇందులో ఉన్నాయి. ఈ ప్రక్రియలో అవకతవకలు జరగకుండా స్థానిక ప్రతినిధులు, స్వతంత్ర పరిశీలకులను భాగస్వాములను చేయాలని ఈసీని కోరారు. ప్రజల ప్రజాస్వామ్య హక్కులను కాపాడేందుకు తమ పార్టీ కట్టుబడి ఉందని స్పష్టం చేసిన విజయ్, నిజమైన ఓటర్లను తొలగించకుండా చూసేందుకు రాష్ట్రవ్యాప్తంగా అవగాహన కార్యక్రమాలు చేపడతామని, ప్రత్యేక శిబిరాలను పర్యవేక్షిస్తామని ప్రకటించారు. "ప్రజాస్వామ్యం, హక్కులు, న్యాయం కోసం టీవీకే ఎల్లప్పుడూ ప్రజల పక్షాన నిలుస్తుంది" అని ఆయన పునరుద్ఘాటించారు. రాబోయే అసెంబ్లీ ఎన్నికల నేపథ్యంలో ఓటర్ల జాబితా సవరణను దుర్వినియోగం చేసే అవకాశం ఉందని తమిళనాడులోని పలు ఇతర రాజకీయ పార్టీలు కూడా ఆందోళన వ్యక్తం చేస్తున్న తరుణంలో విజయ్ విమర్శలు ప్రాధాన్యత సంతరించుకున్నాయి.

# భారత్ త్రిశూల్.. పాక్ ఫైరింగ్ డ్రిల్

**భారత్ నిర్వహిస్తున్న విన్యాసాల ప్రాంతంలోనే పాక్ చర్యలు**

న్యూఢిల్లీ: భారత సరిహద్దుల్లో మరోసారి ఉద్రిక్త వాతావరణం నెలకొంది. భారత్ త్రివిధ దళాలతో కలిసి నిర్వహిస్తున్న 'త్రిశూల్' సైనిక విన్యాసాలకు పోటీగా పాకిస్థాన్ కూడా అదే ప్రాంతంలో ఫైరింగ్ ఎక్సర్‌సైజ్ కోసం నావికాదళ హెచ్చరిక జారీ చేసింది. సర్ క్రీక్ సమీపంలో భారత్ ఎంచుకున్న సముద్ర ప్రాంతంలోనే పాక్ ఈ హెచ్చరికలు జారీ చేయడం చర్చనీయాంశంగా మారింది. ఈ పరిణామాలను ఓపెన్ సోర్స్ ఇంటెలిజెన్స్ విశ్లేషకుడు డామియన్ సైమన్ మొదట వెలుగులోకి తెచ్చారు. భారత్ అక్టోబర్ 30 నుంచి నవంబర్ 10 వరకు పాకిస్థాన్ సరిహద్దు సమీపంలోని సర్ క్రీక్ ప్రాంతంలో 'త్రిశూల్' పేరుతో భారీ సైనిక విన్యాసాలు చేపట్టింది. ఇటీవలి కాలంలో దేశంలో జరిగిన అతిపెద్ద సైనిక ఆపరేషన్లలో ఇది ఒకటని రక్షణ మంత్రిత్వ శాఖ పేర్కొంది. త్రివిధ దళాల సమష్టి సామర్థ్యాలు, ఆత్మనిర్భరత, సాంకేతిక ఆవిష్కరణలను ప్రదర్శించడమే ఈ విన్యాసాల లక్ష్యమని తెలిపింది. ఇందుకోసం 28,000 అడుగుల ఎత్తు వరకు గగనతలాన్ని రిజర్వ్ చేసినట్లు ఉపగ్రహ చిత్రాలు సూచిస్తున్నాయి. సౌరాష్ట్ర తీరంలో ఉభయచర ఆపరేషన్లు, క్రీక్, ఎడారి ప్రాంతాల్లో సైనిక విన్యాసాలు దీనిలో భాగంగా ఉన్నాయి. దీనికి కౌంటర్‌గా పాకిస్థాన్ వ్యూహాత్మక చర్యలు చేపట్టింది. అక్టోబర్ 28-29 తేదీల్లో తన గగనతలంలో కొన్ని మార్గాలను మూసివేస్తూ పాకిస్థాన్ 'నోటీస్ టు ఎయిర్‌మెన్' (నోటమ్) జారీ చేసింది. తాజాగా భారత విన్యాసాలు జరుగుతున్న ప్రాంతంలోనే ఫైరింగ్ కోసం నావికాదళ హెచ్చరికలు జారీ చేసింది. భారత్ సరిహద్దు విన్యాసాలను తాము నిశితంగా గమనిస్తున్నామనే సంకేతాలను పాక్ పంపుతున్నట్లు తెలుస్తోంది. పహల్గామ్ దాడికి ప్రతిస్పందనగా భారత్ 'ఆపరేషన్ సిందూర్' చేపట్టినప్పటి నుంచి ఇరు దేశాల మధ్య ఇలాంటి పోటీ విన్యాసాలు, హెచ్చరికలు సాధారణమైపోయాయి. ఇవి ప్రత్యక్ష ఘర్షణకు దారితీయకపోయినా, పరస్పరం తమ సన్నద్ధతను ప్రదర్శించుకునే వ్యూహాత్మక సంకేతాలని రక్షణ రంగ నిపుణులు విశ్లేషిస్తున్నారు. అయితే, ఒకే ప్రాంతంలో ఇరు దేశాల సైనిక కార్యకలాపాలు జరగడం వల్ల అపార్థాలకు, ప్రమాదాలకు ఆస్కారం పెరుగుతుందని వారు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.



## జోగి రమేశ్ ఇంట్లో సిట్ సోదాలు

ఇబ్రహీంపట్నం, నవంబర్ 2 (ఈవార్తలు): వైకాపా నేత, మాజీ మంత్రి జోగి రమేశ్, ఆయన సోదరుడు రాము నివాసాల్లో సిట్ సోదాలు నిర్వహించింది. నకిలీ మద్యం తయారీ కేసు విచారణలో భాగంగా ఎన్టీఆర్ జిల్లా ఇబ్రహీంపట్నంలోని వారి నివాసాల్లో తనిఖీలు చేపట్టింది. సిట్, ఎక్సైజ్, పోలీస్, క్లూస్‌టీంలతో కూడిన బృందాలు విస్తృతంగా సోదాలు చేశాయి. పలు హార్డ్ డిస్క్‌లను సిట్ బృందాలు స్వాధీనం చేసుకున్నట్లు సమాచారం. నకిలీ మద్యం తయారీ కేసులో జోగి రమేశ్‌ను ఆదివారం ఉదయం సిట్ అరెస్ట్ చేసిన విషయం తెలిసిందే. విజయవాడలోని ఎక్సైజ్ కార్యాలయానికి ఆయన్ను తరలించి విచారించారు. ఈ క్రమంలోనే ఇబ్రహీంపట్నంలోని జోగి రమేశ్ నివాసంలో సోదాలు జరిగాయి.

**ఫోన్లు, సీసీ ఫుటేజ్ స్వాధీనం**

సోదాల్లో జోగి రమేశ్‌తో పాటు ఆయన భార్య మొబైల్ ఫోన్లను, ఇంట్లోని సీసీటీవీ కెమెరాల ఫుటేజ్‌ను అధికారులు స్వాధీనం చేసుకున్నారు. ఈ కేసులో ఏ1గా ఉన్న అద్దేపల్లి జనార్దనరావు ఇటీవల ఇచ్చిన వాంగ్మూలమే జోగి రమేశ్ అరెస్టుకు దారితీసింది. జోగి రమేశ్ ప్రోద్బలంతోనే తాను నకిలీ మద్యం తయారు చేసినట్లు జనార్దనరావు తన వాంగ్మూలంలో పేర్కొన్నాడు. ఆఫ్రికాలో డిస్టిలరీ ఏర్పాటు చేసుకునేందుకు తనకు రూ.3 కోట్లు ఇస్తానని జోగి రమేశ్ హామీ ఇచ్చారని కూడా తెలిపాడు. జనార్దనరావు వాంగ్మూలం ఆధారంగానే సిట్ అధికారులు జోగి రమేశ్ ఇంట్లో ల్యాప్‌టాప్‌లు, సీసీ ఫుటేజ్‌ను పరిశీలించి, కీలక ఆధారాలను సేకరించినట్లు సమాచారం. ఈ కేసులో జోగి రమేశ్ పాత్రపై అధికారులు లోతుగా దర్యాప్తు చేస్తున్నారు.

## మొంథా ఎఫెక్ట్.. కొండెక్కిన కూరగాయల ధరలు

విజయవాడ, నవంబర్ 2 (ఈవార్తలు): మొంథా తుపాను దెబ్బకు కూరగాయల ధరలు కొండెక్కాయని సామాన్యులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. విజయవాడ నగరంలో పెరిగిన ధరలతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. ఇటీవల కురిసిన వర్షాలకు కూరగాయల పంటలు దెబ్బతిన్నాయి. మార్కెట్‌కు సరిపడా సరకు రాకపోవడంతో ఆ ప్రభావం ధరలపై పడింది. ఇతర రాష్ట్రాల నుంచి దిగుమతుల వల్ల ధరలు అమాంతం పెరిగాయని వ్యాపారులు చెబుతున్నారు.

## పన్నులు తగ్గినా
# పెరిగిన ఏపీ జీఎస్టీ ఆదాయం

**అక్టోబర్‌లో 8.77 శాతం వృద్ధి**




విజయవాడ, నవంబర్ 2 (ఈవార్తలు): ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో జీఎస్టీ వసూళ్లు ఆశాజనకమైన వృద్ధిని నమోదు చేశాయి. 2025 అక్టోబర్ నెలకు గాను నికర జీఎస్టీ వసూళ్లలో 8.77 శాతం పెరుగుదల కనిపించింది. వినియోగ వస్తువులు, ఔషధాలు, సిమెంట్ వంటి పలు కీలక వస్తువులపై పన్ను రేట్లు తగ్గించినప్పటికీ ఈ స్థాయిలో వృద్ధి సాధించడం గమనార్హం. రాష్ట్ర పన్నుల ప్రధాన కమిషనర్ బాబు ఏ విడుదల చేసిన ప్రకటన ప్రకారం.. అక్టోబర్ నెలలో నికర జీఎస్టీ వసూళు రూ.3,021 కోట్లుగా నమోదయ్యాయి. ఇది అక్టోబర్ నెల వసూళ్లలో ఇప్పటివరకు రెండో అత్యధికం. ఇక స్థూల జీఎస్టీ వసూళ్లు రూ.3,490 కోట్లకు చేరాయి. రాష్ట్ర వస్తు సేవల పన్ను (ఎస్జీఎస్టీ) రూపంలో రూ.1,247 కోట్లు (6.2 శాతం వృద్ధి), ఐజీఎస్టీ సెటిల్‌మెంట్ ద్వారా రూ.1,773 కోట్లు (10.65 శాతం వృద్ధి) సమకూరాయి. వీటితో పాటు పెట్రోలియం వ్యాట్ ద్వారా రూ.1,282 కోట్లు, వృత్తిపన్ను ద్వారా 18.26 శాతం వృద్ధి నమోదైనట్లు అధికారులు తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న జీఎస్టీ 2.0 సంస్కరణలు, పటిష్టమైన పన్నుల అమలు విధానాల వల్లే ఈ వృద్ధి సాధ్యమైందని అధికారులు విశ్లేషిస్తున్నారు. పన్ను ఎగవేతలను గుర్తించేందుకు డేటా అనలిటిక్స్, కృత్రిమ మేధ (ఏఐ) వంటి ఆధునిక టెక్నాలజీని వినియోగిస్తున్నట్లు పేర్కొన్నారు. తప్పుడు ఇన్‌పుట్ ట్యాక్స్ క్రెడిట్ (ఐటీసీ) క్లెయిమ్‌లను అరికట్టడం, బకాయిదారులపై ప్రత్యేక డ్రైవ్‌లు నిర్వహించడం, వారి ఆస్తులు, బ్యాంకు ఖాతాల నుంచి పన్నులు వసూలు చేయడం వంటి చర్యలు సత్ఫలితాలనిచ్చాయి. ఈ క్రమంలోనే రూ.279 కోట్ల తప్పుడు ఐజీఎస్టీ క్రెడిట్లను రద్దు చేసినట్లు వెల్లడించారు. అక్టోబర్ నెలలో అన్ని పన్నుల రూపంలో ప్రభుత్వానికి మొత్తం రూ.4,458 కోట్ల ఆదాయం వచ్చింది. గత ఏడాది ఇదే నెలలో వసూలైన రూ.4,126 కోట్లతో పోలిస్తే ఇది 8.03 శాతం అధికం. ఈ ఆర్థిక సంవత్సరంలో ఏప్రిల్ నుంచి అక్టోబర్ వరకు ప్రతినెలా వసూళు గతేడాది కంటే మెరుగ్గా ఉన్నాయని కమిషనర్ తెలిపారు. సమర్థవంతమైన పన్నుల పరిపాలన, డేటా ఆధారిత పర్యవేక్షణ, పన్ను చెల్లింపుదారుల సంఖ్య పెరగడం వల్లే ఈ సానుకూల ఫలితాలు వస్తున్నాయని ఆయన వివరించారు.

## ఏపీలో భారీగా ఐపీఎస్‌ల బదిలీలు

**21 మందికి కొత్త పోస్టింగ్‌లు**




అమరావతి, నవంబర్ 2 (ఈవార్తలు): ఆంధ్రప్రదేశ్ పోలీస్ శాఖలో భారీ మార్పులు చోటు చేసుకున్నాయి. రాష్ట్ర వ్యాప్తంగా 21 మంది ఐపీఎస్ అధికారులను బదిలీ చేస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ఈ బదిలీల్లో పలు కీలక విభాగాలకు, జిల్లాలకు కొత్త అధికారులను నియమించారు. ప్రభుత్వం జారీ చేసిన ఉత్తర్వుల ప్రకారం.. విశాఖపట్నం సిటీ డిప్యూటీ కమిషనర్‌గా మణికంఠ చందోలు, విజయవాడ సిటీ డిప్యూటీ కమిషనర్‌గా కృష్ణకాంత్ పటేల్ నియమితులయ్యారు. సైబర్ క్రైమ్, సీఐడీ ఎస్పీగా అధిరాజ్‌సింగ్ రాణా, ఇంటెలిజెన్స్ ఎస్పీగా కె. శ్రీనివాసరావు, ఏసీబీ జాయింట్ డైరెక్టర్‌గా ఈ.జి అశోక్‌కుమార్‌కు బాధ్యతలు అప్పగించారు. వీరితో పాటు మరికొందరికి కూడా కీలక పోస్టింగ్‌లు ఇచ్చారు. విజయవాడ సిటీ ట్రాఫిక్ డిప్యూటీ కమిషనర్‌గా షేక్ షరీన్ బేగం, మహిళల భద్రత విభాగం సీఐడీ ఎస్పీగా వి.రత్న, విజయనగరం ఏపీఎస్పీ బెటాలియన్ కమాండెంట్‌గా రవిశంకర్ రెడ్డి, సీఐడీ ఎస్పీగా ఆర్.గంగాధర్ రావు, ఆర్గనైజేషన్స్ అసిస్టెంట్ ఐజీగా టి.పనసారెడ్డి, ప్లానింగ్ అండ్ కోఆర్డినేషన్ అసిస్టెంట్ ఐజీగా పి.వెంకటరత్నం నియమితులయ్యారు. డీజీపీ కార్యాలయంలో ట్రైనింగ్ అసిస్టెంట్ ఐజీగా ఎం.సత్తిబాబు, ఎన్టీఆర్ పోలీస్ కమిషనరేట్‌లో రూరల్ డిప్యూటీ కమిషనర్‌గా బి.లక్ష్మీనారాయణ, ఈగల్ ఎస్పీగా కేవీఎమ్ మహేశ్వర రాజు, ఎన్టీఆర్ కమిషనరేట్‌లో సైబర్ క్రైమ్స్ కమిషనర్‌గా కృష్ణ ప్రసన్న బాధ్యతలు చేపట్టనున్నారు. అల్లూరి సీతారామరాజు జిల్లా అదనపు ఎస్పీగా పంకజ్ కుమార్ మీనా, శ్రీసత్యసాయి జిల్లా అదనపు ఎస్పీగా సురన అంకిత మహావీర్, జంగారెడ్డి గూడెం ఏఎస్పీగా ఆర్ సుస్మిత, చింతూరు ఏఎస్పీగా హేమంత్ బొడ్డు, పార్వతీపురం ఏఎస్పీగా మనీషా వంగలరెడ్డిని నియమిస్తూ ప్రభుత్వం ఉత్తర్వుల్లోపేర్కొంది.




## ప్రపంచ తెలుగు మహాసభలకు తేదీలు ఖరారు

గుంటూరు, నవంబర్ 2 (ఈవార్తలు): ఆంధ్ర సారస్వత పరిషత్ ఆధ్వర్యంలో జరగనున్న మూడవ ప్రపంచ తెలుగు మహాసభలకు త్రిపుర గవర్నర్ ఎన్. ఇంద్రసేనారెడ్డి ముఖ్య అతిథిగా హాజరుకానున్నారు. 2026 జనవరి 3 నుంచి 5వ తేదీ వరకు గుంటూరు వేదికగా ఈ మహాసభలు నిర్వహించబడతాయి. ఇందులో భాగంగా జనవరి 4న జరిగే "తెలుగు వైభవ పురస్కారాల" ప్రదానోత్సవ కార్యక్రమానికి ఆయన హాజరయ్యేందుకు అంగీకరించారు. ఈ మేరకు పరిషత్ అధ్యక్షులు డాక్టర్ గజల్ శ్రీనివాస్ హైదరాబాద్‌లో గవర్నర్ ఇంద్రసేనారెడ్డిని మర్యాదపూర్వకంగా కలిసి మహాసభలకు ఆహ్వానించారు. ఆయన ఆహ్వానం పట్ల గవర్నర్ సానుకూలంగా స్పందించారని గజల్ శ్రీనివాస్ తెలిపారు. ఈ ప్రతిష్ఠాత్మక కార్యక్రమంలో తప్పకుండా పాల్గొంటానని ఇంద్రసేనారెడ్డి హామీ ఇచ్చారన్నారు. ఈ సందర్భంగా గవర్నర్ ఇంద్రసేనారెడ్డి మాట్లాడుతూ, మాతృభాష అయిన తెలుగును నిలబెట్టుకోవడం ప్రతి తెలుగు వ్యక్తి బాధ్యత అని గుర్తుచేశారు. కాగా, గుంటూరులోని అమరావతి శ్రీసత్య సాయి స్పిరుచ్యువల్ సిటీ ప్రాంగణంలో (హైవే) ఉన్న నందమూరి తారకరామారావు వేదికపై ఈ మహాసభలను ఘనంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు.

# తేనె ఎగుమతుల్లో భారత్ నెం.2

## 2023-24లో 1.07 లక్షల టన్నుల తేనె ఎగుమతి.. కేంద్ర ప్రభుత్వ 'తీపి విప్లవం'తో పెరిగిన ఉత్పత్తి

**నేషనల్ బీకీపింగ్ అండ్ హనీ మిషన్ కీలక పాత్ర**

**2020లో 9వ స్థానం నుంచి రెండో స్థానానికి**

న్యూఢిల్లీ: తేనె ఎగుమతుల్లో భారత్ సరికొత్త రికార్డు సృష్టించింది. ప్రపంచంలోనే రెండో అతిపెద్ద తేనె ఎగుమతిదారుగా అవతరించి తన సత్తా చాటింది. 2020లో 9వ స్థానంలో ఉన్న భారత్.. అనూహ్యమైన వృద్ధిని సాధించి ఈ ఘనతను అందుకుంది. 2023-24 ఆర్థిక సంవత్సరంలో దేశం నుంచి 1.07 లక్షల మెట్రిక్ టన్నుల సహజసిద్ధమైన తేనె ఎగుమతి కాగా, దీని విలువ 177.55 మిలియన్ డాలర్లు (సుమారు రూ. 1,480 కోట్లు) అని కేంద్ర ప్రభుత్వం ఆదివారం ఒక ప్రకటనలో వెల్లడించింది. కేంద్ర ప్రభుత్వం ప్రారంభించిన 'తీపి విప్లవం' ఈ విజయంలో కీలక పాత్ర పోషించింది. దేశంలో తేనెటీగల పెంపకాన్ని శాస్త్రీయంగా ప్రోత్సహించడం, నాణ్యమైన తేనె ఉత్పత్తిని పెంచడమే లక్ష్యంగా 'నేషనల్ బీకీపింగ్ అండ్ హనీ మిషన్'ను ప్రభుత్వం అమలు చేస్తోంది. ఆత్మనిర్భర్ భారత్ కార్యక్రమంలో భాగంగా 2020-21 నుంచి 2022-23 వరకు రూ. 500 కోట్ల బడ్జెట్‌తో ఈ పథకాన్ని ప్రారంభించారు. దీనికి లభించిన ఆదరణతో, మిగిలిన రూ. 370 కోట్ల బడ్జెట్‌తో మరో మూడేళ్లపాటు (2025-26 వరకు) పొడిగించారు. తేనెటీగల పెంపకం కేవలం తేనె ఉత్పత్తికే పరిమితం కాదు. ఇది వ్యవసాయ ఆధారిత గ్రామీణ ఆర్థిక వ్యవస్థకు వెన్నుదన్నుగా నిలుస్తోంది. పంట పొలాల్లో పరాగ సంపర్కానికి తేనెటీగలు ఎంతగానో దోహదపడతాయి. తద్వారా పంటల దిగుబడి పెరిగి రైతుల ఆదాయం రెట్టింపు అవుతుంది. తేనె మాత్రమే కాకుండా, మైనం, బీ పోలెన్, రాయల్ జెల్లీ వంటి ఇతర విలువైన ఉత్పత్తులు కూడా గ్రామీణ ప్రాంతాల్లోని రైతులకు, భూమిలేని నిరుపేదలకు అదనపు ఆదాయ వనరుగా మారాయి. ఈ మిషన్‌ను మూడు ఉప-మిషన్లుగా విభజించి అమలు చేస్తున్నారు. మొదటిది, శాస్త్రీయ పెంపకం ద్వారా పంటల ఉత్పాదకతను పెంచడం. రెండోది, తేనె సేకరణ, ప్రాసెసింగ్, మార్కెటింగ్ వంటి మౌలిక సదుపాయాలను మెరుగుపరచడం. మూడోది, వివిధ ప్రాంతాలకు అనువైన పరిశోధనలు,



సాంకేతికతను అభివృద్ధి చేయడం. తేనె నాణ్యతను, అది ఎక్కడ తయారైందో తెలుసుకునేందుకు 'మధుక్రాంతి' అనే ఆన్‌లైన్ పోర్టల్‌ను కూడా ప్రభుత్వం అందుబాటులోకి తెచ్చింది. దేశంలోని విభిన్న వాతావరణ పరిస్థితులు తేనెటీగల పెంపకానికి విస్తృత అవకాశాలు కల్పిస్తుండటంతో, భవిష్యత్తులో భారత్ ఈ రంగంలో మరింత ఉన్నత స్థాయికి చేరగలదని నిపుణులు అంచనా వేస్తున్నారు.

## అంబులెన్స్ ఢీకొని దంపతులు మృతి

బెంగళూరు: ప్రాణాలు కాపాడాల్సిన అంబులెన్సే ప్రాణాలు తీసింది. అదుపు తప్పిన అంబులెన్స్ సిగ్నల్ వద్ద ఆగి ఉన్న మోటార్‌సైకిళ్లపైకి దూసుకెళ్లింది. ఈ దుర్ఘటనలో ఓ జంట అక్కడికక్కడే ప్రాణాలు కోల్పోయింది. గత రాత్రి సుమారు 11 గంటల సమయంలో బెంగళూరులోని రిచ్‌మండ్ సర్కిల్ వద్ద ఈ విషాదం చోటుచేసుకుంది. రెడ్ సిగ్నల్ పడటంతో పలువురు వాహనదారులు తమ బైక్‌లను ఆపి వేచి ఉన్నారు. అదే సమయంలో వెనుక నుంచి వేగంగా వచ్చిన ఓ అంబులెన్స్ అదుపుతప్పి వారిపైకి దూసుకెళ్లింది. ప్రమాద తీవ్రతకు మూడు బైక్‌లు నుజ్జునుజ్జయ్యాయి. 40 ఏళ్ల ఇస్మాయిల్, ఆయన భార్య సమీన్ బాను ప్రయాణిస్తున్న డియో స్కూటర్‌ను అంబులెన్స్ బలంగా ఢీకొట్టి, కొంత దూరం ఈడ్చుకెళ్లింది. దీంతో వారు అక్కడికక్కడే మృతి చెందారు. ఈ ఘటనలో మరో ఇద్దరు తీవ్రంగా గాయపడగా, వారిని వెంటనే చికిత్స నిమిత్తం సమీప ఆసుపత్రికి తరలించారు. మోటార్ సైకిళ్లను ఢీకొట్టిన తర్వాత అంబులెన్స్ సమీపంలోని పోలీస్ ఔట్‌పోస్ట్‌ను ఢీకొని ఆగింది. ప్రమాదం జరిగిన వెంటనే స్థానికులు అక్కడకు చేరుకుని సహాయక చర్యలు చేపట్టారు. ధ్వంసమైన వాహనాలు, పోలీస్ ఔట్‌పోస్ట్ మధ్య ఇరుక్కుపోయిన అంబులెన్స్‌ను పక్కకు జరిపేందుకు ప్రయత్నించారు. సమాచారం అందుకున్న విల్సన్ గార్డెన్ ట్రాఫిక్ పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని పరిస్థితిని సమీక్షించారు. కేసు నమోదు చేసుకుని, ప్రమాదానికి దారితీసిన కారణాలపై దర్యాప్తు ప్రారంభించారు.

# భార్యకు జేడీ వాన్స్ విడాకులు?

## 2028 అధ్యక్ష ఎన్నికల కోసమే?.. ఉష జాతీయతపై అమెరికన్ల అభ్యంతరం

వాషింగ్టన్: అమెరికా ఉపాధ్యక్షుడు జేడీ వాన్స్, ఆంధ్రప్రదేశ్ మూలాలున్న ఆయన భార్య చిలుకూరి ఉష దాంపత్య బంధంలో విభేదాలు తలెత్తాయా? వారిద్దరూ త్వరలో విడిపోనున్నారా? ప్రస్తుతం అమెరికన్ సోషల్ మీడియాలో ఈ అంశంపై తీవ్ర చర్చ జరుగుతోంది. తన భార్య మతం గురించి వాన్స్ చేసిన వ్యాఖ్యలు, మరో మహిళతో ఆయన సన్నిహితంగా కనిపించడం ఈ ఊహాగానాలకు మరింత బలాన్నిచ్చింది. అక్టోబరు 29న మిసిసిపీ యూనివర్సిటీ క్యాంపస్‌లో జరిగిన ఓ కార్యక్రమంలో జేడీ వాన్స్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా యాంకర్ అడిగిన ప్రశ్నకు బదులిస్తూ "దాదాపు ప్రతి ఆదివారం ఉష నాతో పాటు చర్చికి వస్తుంది. నేను క్రైస్తవ మతం పట్ల ఎంత అంకితభావంతో ఉన్నానో, ఆమె కూడా ఏదో ఒక రోజు పూర్తిగా క్రైస్తవంలోకి మారుతుందని ఆశిస్తున్నాను" అని వ్యాఖ్యానించారు. ఇదే వేదికపై ఉన్న ట్రంప్ మద్దతుదారు, ఇటీవల హత్యకు గురైన ఛార్లీ కిర్క్ భార్య ఎరికా కిర్క్‌తో వాన్స్ గాఢంగా ఆలింగనం చేసుకున్నారు. అనంతరం ఎరికా మాట్లాడుతూ తన భర్త స్థానాన్ని ఎవరూ భర్తీ చేయలేరని, అయితే ఆయనలోని కొన్ని మంచి లక్షణాలు వాన్స్‌లో కనిపిస్తున్నాయని చెప్పడం చర్చనీయాంశంగా మారింది. ఈ రెండు ఘటనలతో వాన్స్, ఉష విడిపోతున్నారనే ప్రచారం సోషల్ మీడియాలో ఊపందుకుంది. ఈ ప్రచారం వెనుక బలమైన రాజకీయ కారణాలు ఉన్నాయని విశ్లేషకులు భావిస్తున్నారు. జేడీ వాన్స్ అమెరికాలోని శ్వేతజాతీయవాదులకు గట్టి మద్దతుదారు. అయితే, ఆయన భార్య భారత సంతతికి చెందిన హిందువు



కావడంతో ఆ వర్గాలు తీవ్ర అసంతృప్తితో ఉన్నాయి. శ్వేతజాతీయుల స్థానాన్ని ప్రణాళికాబద్ధంగా ఇతరులు భర్తీ చేస్తున్నారనే 'గ్రేట్ రీప్లేస్‌మెంట్ థియరీ'ని వారు బలంగా నమ్ముతారు. "భారతీయురాలిని భార్యగా చేసుకున్న వాన్స్‌కు శ్వేతజాతి గురించి మాట్లాడే అర్హత లేదు" అంటూ నిక్ ఫ్యూంటెస్ అనే జాత్యహంకార నేత కొంతకాలంగా ఆయనపై విమర్శలు చేస్తున్నారు. 2028లో ట్రంప్ పదవీకాలం ముగిశాక, రిపబ్లికన్ పార్టీ తరఫున అధ్యక్ష అభ్యర్థి కావాలని వాన్స్ ఆశిస్తున్నారు. అయితే, తన భార్య జాతీయత, మతం వల్ల శ్వేతజాతీయుల మద్దతు కోల్పోతాననే ఆందోళన ఆయనలో ఉందని, అందుకే ఉష నుంచి విడిపోయేందుకు సిద్ధమవుతున్నారన్న విశ్లేషణలు వినిపిస్తున్నాయి. న్యూయార్క్ టైమ్స్‌కు చెందిన షానన్ వాట్స్ లాంటి వారు, వాన్స్ త్వరలోనే ఉషకు విడాకులిచ్చి వచ్చే ఏడాది ఎరికాను వివాహం చేసుకుంటారని అంచనా వేస్తున్నారు. పదవిలో ఉండగా విడాకులు తీసుకున్న తొలి ఉపాధ్యక్షుడిగా వాన్స్ నిలుస్తారని ట్రాన్స్‌జెండర్ కార్యకర్త అరి డ్రెనెన్ ట్వీట్ చేశారు.


### హిందూ అమెరికన్ ఫౌండేషన్ స్పందన

ఈ పరిణామాలపై హిందూ అమెరికన్ ఫౌండేషన్ స్పందించింది. క్రైస్తవంతో పాటు హిందూ మతం గురించి కూడా తెలుసుకోవాలని వాన్స్‌కు సూచించింది. "అమెరికాకు పునాది అయిన మతస్వేచ్ఛ హిందువులకు కూడా వర్తిస్తుంది. మీ మద్దతుదారుల్లో కొందరు దీన్ని విశ్వసించడం లేదు. హిందువులకు తమ మతాన్ని ఆచరించే హక్కు ఉంటుందని మీరు గుర్తించి మద్దతివ్వాలి" అని ఫౌండేషన్ ఒక ప్రకటనలో కోరింది.

# కొత్త ఉద్యోగాలు 'ఏఐ'పైనే

## మైక్రోసాఫ్ట్ సీఈవో సత్య నాదెళ్ల కీలక ప్రకటన.. ఉద్యోగుల సంఖ్య పెంచుతామని ప్రకటన

న్యూయార్క్: గతేడాది వేల ఉద్యోగాల కోతలు చేపట్టిన టెక్ దిగ్గజం మైక్రోసాఫ్ట్, ఇప్పుడు మళ్లీ నియామకాలకు సిద్ధమవుతోంది. అయితే ఈసారి నియామక ప్రక్రియలో కీలక మార్పులు చోటుచేసుకోనున్నాయి. ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ) నైపుణ్యాలు ఉన్నవారికే పెద్దపీట వేయనున్నట్లు కంపెనీ స్పష్టం చేసింది. ఇన్వెస్టర్ బ్రాడ్ గెర్స్టనర్‌తో జరిగిన బీజీ2 పాడ్‌కాస్ట్‌లో మైక్రోసాఫ్ట్ సీఈవో సత్య నాదెళ్ల ఈ విషయాలను వెల్లడించారు. భవిష్యత్తులో తమ ఉద్యోగుల సంఖ్యను పెంచుతామని ఆయన స్పష్టం చేశారు. అయితే, ఈ నియామకాలు 'స్మార్టర్, మోర్ లెవరేజ్డ్' పద్ధతిలో ఉంటాయని, ఏఐ సాంకేతికతే దీనికి చోదకశక్తిగా నిలుస్తుందని తెలిపారు. 2025 జూన్ చివరి నాటికి మైక్రోసాఫ్ట్‌లో సుమారు 2.28 లక్షల మంది ఉద్యోగులు ఉన్నారు. గతంలో దాదాపు 15,000 మందికి పైగా ఉద్యోగులను తొలగించినప్పటికీ, ఉద్యోగుల సంఖ్య దాదాపు స్థిరంగా ఉంది. దీనికి భిన్నంగా, ఏఐ బూమ్ రాకముందు 2022లో కంపెనీ తన ఉద్యోగుల




సంఖ్యను 22 శాతం పెంచుకుంది. మైక్రోసాఫ్ట్ తన దృష్టిని ఏఐ మౌలిక సదుపాయాలు, భాగస్వామ్యాలు, మైక్రోసాఫ్ట్ 365 కోపైలట్, గిట్‌హబ్ కోపైలట్ వంటి టూల్స్‌పై పెట్టుబడులు పెట్టడం వల్లే నియామకాల వేగం తగ్గింది. ఇకపై భారీగా నియామకాలు చేపట్టే దశ ముగిసిందని, 'టార్గెటెడ్ స్కేలింగ్' దశ ప్రారంభమైందని నాదెళ్ల వివరించారు. ఏఐ సహాయంతో చిన్న బృందాలు కూడా అద్భుతమైన ఫలితాలు సాధించగలవని ఆయన అభిప్రాయపడ్డారు. ఉద్యోగులు చేసే ప్రతీ పనిలో ఏఐ వినియోగం తప్పనిసరి అని, ఇది ఒక 'అన్‌లెర్నింగ్, లెర్నింగ్' ప్రక్రియ అని ఆయన పేర్కొన్నారు. డిమాండ్‌కు తగినట్లు నియామకాలు చేపట్టలేని పరిస్థితుల్లో, తమ కంపెనీ ఫైబర్ నెట్‌వర్క్ కార్యకలాపాలను నిర్వహించడానికి ఎగ్జిక్యూటివ్ ఏఐ ఏజెంట్లను ఎలా ఉపయోగించారో ఆయన ఉదాహరణగా చెప్పారు. ఇదిలా ఉండగా, ఈ ఏడాది కూడా మైక్రోసాఫ్ట్ తన ఉద్యోగులలో 4 శాతం, అంటే సుమారు 9,000 మందిని తొలగించిందని పలు నివేదికలు వచ్చాయి. ఈ కోతలు ముఖ్యంగా మైక్రోసాఫ్ట్ గేమింగ్ (ఎక్స్‌బాక్స్) విభాగంపై తీవ్ర ప్రభావం చూపాయి. వ్యూహాత్మక వృద్ధి రంగాలపై దృష్టి సారించేందుకే ఈ నిర్ణయం తీసుకున్నట్లు ఎక్స్‌బాక్స్ హెడ్ ఫిల్ స్పెన్సర్ తెలిపారు.

# రోగి కడుపులో 400 నాణేలు

**ఎండోస్కోపీ ద్వారానే బయటకు తీసిన డాక్టర్**

**ఇంటర్నేషనల్ బుక్ ఆఫ్ రికార్డ్స్‌లో చోటు**

బఠిండా: పంజాబ్‌లోని బఠిండాకు చెందిన గ్యాస్ట్రోఎంటరాలజిస్ట్ డాక్టర్ గగన్‌దీప్ గోయల్ అరుదైన ఘనతను సొంతం చేసుకున్నారు. ఒక రోగి కడుపులో నుంచి 400లకు పైగా లోహపు వస్తువులను ఎలాంటి శస్త్రచికిత్స లేకుండా, కేవలం ఎండోస్కోపీ ద్వారా తొలగించి ఆసియా బుక్ ఆఫ్ రికార్డ్స్‌లో ఆయన స్థానం సంపాదించారు. ఈ అద్భుతమైన వైద్య ప్రక్రియ 2015లో జరుగగా, దానికి సంబంధించిన గుర్తింపు తాజాగా లభించింది. వివరాల్లోకి వెళితే, 2015లో మానసిక ఆరోగ్య సమస్యలతో బాధపడుతున్న రాజ్‌పాల్ సింగ్ అనే యువకుడు తీవ్రమైన కడుపునొప్పితో డాక్టర్ గగన్‌దీప్‌ను సంప్రదించాడు. అతడికి స్కానింగ్ చేయగా, కడుపులో ఇనుప మేకులు, నాణేలు, బుల్లెట్ శకలాలు, నట్‌బోల్టులతో పాటు ఇతర లోహపు వస్తువులు ఉన్నట్లు వైద్యులు గుర్తించారు. దీంతో డాక్టర్ గగన్‌దీప్, మరో ఎనిమిది మంది వైద్యులతో కూడిన బృందం వెంటనే చికిత్సను ప్రారంభించింది. రోగికి పెద్ద కోత పెట్టకుండా, కేవలం ఎండోస్కోపీ ప్రక్రియ ద్వారానే ఆ వస్తువులను తొలగించాలని వైద్యులు నిర్ణయించారు. ఇది అత్యంత సవాలుతో కూడుకున్నప్పటికీ, నాలుగు రోజుల పాటు రోజుకు నాలుగు గంటల చొప్పున శ్రమించి వైద్య బృందం విజయం సాధించింది. మొత్తం 138 నాణేలు, 173 మేకులు, 107 బుల్లెట్ శకలాలతో పాటు ఇతర ప్లాస్టిక్ పదార్థాలను సురక్షితంగా బయటకు తీశారు. ఈ సందర్భంగా డాక్టర్ గోయల్ మాట్లాడుతూ, "శస్త్రచికిత్స లేకుండా కేవలం ఎండోస్కోపీతో ఇన్ని వస్తువులను తొలగించడం ప్రపంచంలో ఇదే మొదటిసారి. గతంలో జపాన్‌లో శస్త్రచికిత్స చేసి 350 వస్తువులు తొలగించిన రికార్డు ఉంది. అప్పట్లోనే ఆసియా బుక్ ఆఫ్ రికార్డ్స్ కోసం దరఖాస్తు చేద్దామనుకున్నాను, కానీ సమయం దొరకలేదు. ఇటీవలే ఆ ప్రక్రియ పూర్తి చేయగా, ఇప్పుడు గుర్తింపు రావడం చాలా సంతోషంగా ఉంది," అని అన్నారు. అంతేకాకుండా, తన పేరు ఇంటర్నేషనల్ బుక్ ఆఫ్ రికార్డులకు కూడా ఎంపికైందని ఆయన వెల్లడించారు.



## కరూర్ ఘటనకు విజయే బాధ్యుడు

**ఉదయనిధి స్టాలిన్ ఆరోపణలు**

చెన్నై: తమిళనాడులో రాజకీయాలు వేడెక్కాయి. కరూర్‌లో 41 మంది మరణానికి కారణమైన తొక్కిసలాట ఘటనపై ఉప ముఖ్యమంత్రి ఉదయనిధి స్టాలిన్, నటుడు, తమిళగ వెట్రి కళగం (టీవీకే) అధినేత విజయ్‌ను లక్ష్యంగా చేసుకుని తీవ్ర ఆరోపణలు చేశారు. ఈ దుర్ఘటనకు విజయే ప్రధాన బాధ్యుడని ఆయన పరోక్షంగా వ్యాఖ్యానించారు. ఈ ఘటనపై ఉదయనిధి స్టాలిన్ మాట్లాడుతూ "కరూర్‌లో జరిగిన దానికి అందరూ బాధ్యులే, కానీ ఒకరు మాత్రం అత్యంత ప్రధాన బాధ్యులుగా ఉన్నారు" అని వ్యాఖ్యానించారు. ఈ వ్యాఖ్యలతో ఆయన నేరుగా విజయ్‌ను ఉద్దేశించారని రాజకీయ వర్గాలు భావిస్తున్నాయి. విజయ్ ఏర్పాటు చేసిన రాజకీయ ర్యాలీలోనే ఈ విషాదం చోటుచేసుకున్న సంగతి తెలిసిందే. ప్రస్తుతం ఈ కేసును సెంట్రల్ బ్యూరో ఆఫ్ ఇన్వెస్టిగేషన్ (సీబీఐ) విచారిస్తోంది. అయితే, విజయ్‌ను రాజకీయంగా నియంత్రించేందుకే బీజేపీ ప్రభుత్వం సీబీఐని రంగంలోకి దించిందని డీఎంకే ఆరోపిస్తోంది. ఈ దుర్ఘటన జరిగినప్పటి నుంచి డీఎంకే నేతలు విజయ్, ఆయన పార్టీ టీవీకేను బాధ్యులను చేస్తూ విమర్శలు గుప్పిస్తున్నారు. తాజాగా ఉదయనిధి చేసిన వ్యాఖ్యలతో అధికార డీఎంకే, కొత్తగా ఏర్పాటైన టీవీకే మధ్య రాజకీయ ఉద్రిక్తతలు మరింత తీవ్రమయ్యాయి. ఈ ఆరోపణలు తమిళనాడు రాజకీయాల్లో పెను దుమారం రేపుతున్నాయి.



## మెక్సికోలో బాంబ్ బ్లాస్ట్.. 23 మంది మృతి

న్యూఢిల్లీ: మెక్సికోలోని హెర్మోసిల్లో సిటీలో ఘోర విషాదం చోటుచేసుకుంది. స్థానిక సూపర్ మార్కెట్లో శనివారం బాంబు పేలింది. దీంతో సూపర్ మార్కెట్ భవనంలో భారీగా మంటలు ఎగిసిపడ్డాయి. ఈ దుర్ఘటనలో 23 మంది ప్రాణాలు కోల్పోయారని స్థానిక అధికారులు తెలిపారు. మృతుల్లో ఎనిమిది మంది మైనర్లు, ఇద్దరు గర్భిణీలు సహా పలువురు వృద్ధులు ఉన్నట్లు పేర్కొన్నారు. మరో పన్నెండు మందికి తీవ్ర గాయాలయ్యాయని వివరించారు. సూపర్ మార్కెట్లో ఎగిసిపడ్డ మంటలు విస్తరించడంతో బిల్డింగ్ ముందున్న పార్కింగ్ ప్లేస్ లోని ఓ కారు దగ్ధమైంది. స్థానికుల సమాచారంతో ఫైర్ సిబ్బంది వెంటనే అక్కడికి చేరుకుని మంటలను అదుపు చేశారు. గాయపడిన వారిని ఆసుపత్రికి తరలించారు. ఈ దుర్ఘటనపై సోనోరా రాష్ట్ర గవర్నర్ అల్ఫోన్సో దురాజో స్పందించారు. ప్రమాద ఘటనపై అల్ఫోన్సో ఓ వీడియోలో మాట్లాడుతూ.. ఇది అత్యంత బాధాకరమైన ఘటన అని పేర్కొన్నారు. ఆత్మీయులను కోల్పోయిన కుటుంబాలకు ప్రగాఢ సానుభూతి తెలిపారు. బాధిత కుటుంబాలను ఆదుకునేందుకు తాము అన్ని చర్యలు తీసుకుంటామని చెప్పారు. ఈ ప్రమాద ఘటన తనను కలచివేసిందని మెక్సికో అధ్యక్షురాలు క్లాడియా షేన్‌బామ్ ట్వీట్ చేశారు. మృతుల కుటుంబాలకు ఆమె తన సానుభూతిని వ్యక్తం చేశారు.

## కెన్యాలో 21 మంది దుర్మరణం

న్యూఢిల్లీ: ఆఫ్రికా దేశమైన కెన్యాలో విషాదం చోటుచేసుకుంది. భారీ వర్షాలు, వరదల కారణంగా కొండచరియలు విరిగిపడటంతో 21 మంది మరణించారు. మరో 30 మందికిపైగా గల్లంతయ్యారు. దక్షిణ కెన్యా ప్రాంతంలోని మారాక్‌వెట్ ప్రాంతంలో భారీ వర్షాలు కురుస్తుండటంతో కొండచరియలు విరిగిపడ్డాయని కెన్యా అంతర్గత వ్యవహారాల మంత్రి వెల్లడించారు. ఈ ఘటనలో గల్లంతైన వారి కోసం గాలింపు చర్యలు చేపట్టామని సదరు మంత్రి తెలిపారు. రెస్క్యూ ఆపరేషన్ కొనసాగుతోందని పేర్కొన్నారు. ప్రస్తుతం అక్కడ వర్షాకాలం కావడంతో భారీ వర్షాలు కురుస్తున్నాయని వెల్లడించారు.



## ఈ ఏడాది తొక్కిసలాటలో 114 మంది బలి

**కాశీబుగ్గ ఆలయ ఘటన ఈ ఏడాది ఆరోది**

2024లో హత్రాస్ ఘటనతో 123 మంది మరణం

న్యూఢిల్లీ: దేశంలో తొక్కిసలాట మరణాలు ఆందోళనకర స్థాయిలో కొనసాగుతున్నాయి. నివారించగలిగే ప్రమాదాలుగా పరిగణిస్తున్నప్పటికీ, ఈ ఏడాది ఇప్పటివరకు జరిగిన తొక్కిసలాటల్లో కనీసం 114 మంది ప్రాణాలు కోల్పోయారు. తాజాగా ఆంధ్రప్రదేశ్‌లోని శ్రీకాకుళం జిల్లా కాశీబుగ్గ వెంకటేశ్వర స్వామి ఆలయంలో జరిగిన ఘటనతో ఈ విషాదాల పరంపర మరోసారి వెలుగులోకి వచ్చింది. ఇటీవలి సంవత్సరాల్లో ఇదే రెండో అత్యధిక మరణాల సంఖ్య కావడం గమనార్హం. 2024లో జరిగిన ఇలాంటి ఘటనల్లో 123 మంది మరణించగా, అందులో ఉత్తరప్రదేశ్‌లోని హత్రాస్‌లో నారాయణ్ సకార్ హరి అనే గురువు నిర్వహించిన సత్సంగ్‌లో జరిగిన తొక్కిసలాటలోనే 116 మంది చనిపోయారు. కాశీబుగ్గ ఘటన ఈ ఏడాదిలో జరిగిన ఆరో ప్రధాన తొక్కిసలాట. ఇంతకుముందు జరిగిన ఐదు పెద్ద ఘటనల్లో కూడా భారీగా ప్రాణనష్టం సంభవించింది. జనవరి 29న మహాకుంభ్‌లో 30 మంది, ఫిబ్రవరి 15న న్యూఢిల్లీ రైల్వే స్టేషన్‌లో 18 మంది మరణించారు. ఉత్తర గోవాలోని షిర్గావ్ గ్రామంలో లైరాయ్ దేవి జాతరకు లక్షలాదిగా తరలివచ్చిన భక్తుల్లో ఏడుగురు తొక్కిసలాటలో ప్రాణాలు విడిచారు. అలాగే, ఐపీఎల్‌లో ఆర్సీబీ తొలిసారి విజయం సాధించిన సందర్భంగా బెంగళూరులోని చిన్నస్వామి స్టేడియం వద్ద జూన్ 4న జరిగిన సంబరాల్లో 11 మంది అభిమానులు మరణించారు. ఇటీవల తమిళనాడులోని కరూర్‌లో ప్రముఖ నటుడు విజయ్ స్థాపించిన తమిళగ వెట్రి కళగం (టీవీకే) పార్టీ ర్యాలీలో జరిగిన తొక్కిసలాటలో ఏకంగా 41 మంది చనిపోయారు. ఇలాంటి ఘటనలు పునరావృతం కావడానికి సరైన జన నియంత్రణ వ్యవస్థలు లేకపోవడం, అధికారుల మధ్య సరైన సమాచార లోపం, అత్యవసర స్పందన వ్యవస్థల కొరతే కారణమని నిపుణులు అభిప్రాయపడుతున్నారు. కార్యక్రమాలకు హాజరయ్యే జనాల సంఖ్యను అధికారులు తక్కువగా అంచనా వేయడం కూడా గందరగోళానికి, తొక్కిసలాటలకు దారితీస్తోందని వారు విశ్లేషిస్తున్నారు.

## 11 కోట్ల లాటరీ.. విజేత ఎక్కడ?




చండీగఢ్: పంజాబ్‌లో ఒక అదృష్టవంతుడిని దీపావళి బంపర్ లాటరీ వరించింది. ఏకంగా రూ.11 కోట్ల జాక్‌పాట్ తగలడంతో ఆ వ్యక్తి రాత్రికి రాత్రే కోటీశ్వరుడు అయ్యాడు. అయితే, ఆ విజేత ఎవరనేది మాత్రం ఇంకా రహస్యంగానే ఉంది. పంజాబ్ ప్రభుత్వం లాటరీ ఫలితాలు ప్రకటించినా, విజేత ఇంకా బయటకు రాకపోవడంతో సర్వత్రా ఆసక్తి నెలకొంది. భఠిండాలోని రతన్ లాటరీ కేంద్రంలో ఈ టికెట్‌ను విక్రయించారు. ఈ సందర్భంగా లాటరీ కేంద్రం నిర్వాహకుడు ఉమేశ్ మాట్లాడుతూ.. తన వద్ద టికెట్లు కొనేవారిలో దాదాపు 40 శాతం మంది తమ వివరాలు వెల్లడించరని, ఫలితాలను ఆన్‌లైన్‌లో చూసుకుంటారని తెలిపారు. తాను గత 35-40 ఏళ్లుగా లాటరీలు అమ్ముతున్నానని, తన దుకాణంలో టికెట్లు కొని 40 మందికి పైగా కోటీశ్వరులయ్యారని ఆయన సంతోషం వ్యక్తం చేశారు. లాటరీ నిబంధనల ప్రకారం.. విజేత 25 రోజుల్లోగా తమ టికెట్‌తో వచ్చి నగదును క్లెయిమ్ చేసుకోవాల్సి ఉంటుంది. ఒకవేళ గడువులోగా ఎవరూ రాకపోతే, ఆ మొత్తం ప్రభుత్వానికే చెందుతుంది. గెలుచుకున్న రూ.11 కోట్లలో పన్నులు పోనూ, విజేత చేతికి సుమారు రూ.7.7 కోట్లు అందే అవకాశం ఉందని అధికారులు చెబుతున్నారు. ఈ బంపర్ లాటరీ టికెట్‌ను అమ్మినందుకు ఉమేశ్‌కు కూడా ప్రభుత్వం నుంచి ప్రత్యేకంగా కమీషన్ లభించనుంది. ఈ వార్త తెలియడంతో ఆయన దుకాణం వద్ద సందడి వాతావరణం నెలకొంది. అందరూ ఆ అదృష్టవంతుడు ఎవరై ఉంటారా అని ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు.

లయ్సూరి చిత్రం






## ఆంధ్రా కింగ్ తాలూకా షూటింగ్ కంప్లీట్

ఎనర్జిటిక్ స్టార్ రామ్ పోతినేని తన కొత్త చిత్రం 'ఆంధ్రా కింగ్ తాలూకా' షూటింగ్ పూర్తి చేసుకున్నట్లు ప్రకటించారు. ఈ విషయాన్ని ఆయన సోషల్ మీడియా ద్వారా అభిమానులతో పంచుకున్నారు. సినిమా చిత్రీకరణ విజయవంతంగా ముగిసిందని తెలుపుతూ, విడుదల తేదీని కూడా ఖరారు చేశారు. ఈ చిత్రాన్ని నవంబర్ 28న ప్రేక్షకుల ముందుకు తీసుకురానున్నట్లు వెల్లడించారు. ఈ సందర్భంగా రామ్ తన సోషల్ మీడియా ఖాతాలో ఒక పోస్ట్ పెట్టారు. "ఫైనల్‌గా షూటింగ్ పూర్తయింది. నేను గర్వపడే సినిమా ఇది. మనమందరం గర్వపడే సినిమా అవుతుంది. త్వరలోనే మీ ముందుకు వస్తున్నాం" అని పేర్కొన్నారు. ఈ సినిమాపై ఆయన పూర్తి సంతృప్తితో ఉన్నట్లు ఈ పోస్ట్ ద్వారా స్పష్టమవుతోంది. అంతేకాకుండా, తన కెరీర్‌లో ఇలాంటి ఒక అందమైన చిత్రాన్ని అందించినందుకు దర్శకుడు పి. మహేశ్ బాబుకు రామ్ ప్రత్యేకంగా ధన్యవాదాలు తెలిపారు.

## సమంతకు కీర్తిసురేశ చెక్?

రాజ్ కుమార్ రావు హీరోగా ఆదిత్య నింబాల్కర్ ఓ చిత్రానికి సన్నాహాలు చేస్తున్నారు. ఇందులో హీరోయిన్‌గా తొలుత సమంతను తీసుకోవాలనుకున్నారట. దీనిలో భాగంగా విషయం కూడా ఆమెకు చెప్పి ఆఫీస్‌కు పిలిపించారట. ఆమెతోపాటు మరో నాయికగా తాన్యా మణిక్‌తో కూడా చర్చలు జరిపారట. కానీ ఏం జరిగిందో తెలియదు గానీ సమంత స్థానంలో ఇప్పుడు మరో సౌత్ నటి అయిన కీర్తి సురేష్‌ని ఎంపిక చేసినట్లు వార్తలొస్తున్నాయి. ఆ పాత్రకు సామ్ కంటే కీర్తి అయితే పర్ఫెక్ట్ గా సూటవుతుందని మేకర్స్ భావించే ఈ నిర్ణయానికి వచ్చినట్లు వినిపిస్తోంది. మరి ఇందులో వాస్తవాలు తెలియాల్సి ఉంది. సమంత కూడా కొంత కాలంగా బాలీవుడ్ అవకాశాల కోసం ఎంత సీరియస్ గా ప్రయత్నిస్తుందో తెలిసిందే. కీర్తి సురేష్ కూడా బాలీవుడ్‌కి వెళ్లినా ఆమె కంటే సామ్ సీరియస్‌గా ఛాన్సు ల కోసం ట్రై చేస్తోంది. ఇప్పటికే అక్కడ ట్రెండ్‌కు తగ్గట్టు మౌల్డ్ అయింది. పరిచయాలు అంతకంతకు పెంచుకుంటోంది. రిలేషన్ షిప్స్ విషయంలోనూ అమ్మడు అంతే ఓపెన్ గా ఉంటూ అవకాశాలు కొట్టేస్తోంది.






## ప్రేమంటే.. థ్రిల్ ప్రాప్తిరస్తు

ప్రియదర్శి, ఆనంది కాంబోలో వస్తోన్న చిత్రం 'ప్రేమంటే'. 'థ్రిల్ యూ ప్రాప్తిరస్తు' అనే ట్యాగ్‌లైన్‌తో వస్తోన్న ఈ చిత్రాన్ని నవనీత్ శ్రీరామ్ డైరెక్ట్ చేస్తున్నాడు. పాపులర్ యాంకర్ సుమ కీలక పాత్ర పోషిస్తోంది. తాజాగా మేకర్స్ టీజర్ విడుదల చేశారు. మీకేం అంచనాలు లేవు.. మ్యారేజ్ లైఫ్ ఎక్స్‌పెక్టేషన్స్ అని ఆనందిని అడుగుతుంటే..ఉదాహరణకు నేను పెళ్లి చేసుకునే అమ్మాయికి నా వల్ల ఎలాంటి సమస్యలు రాకూడదని నేనుకుంటా అని ప్రియదర్శి అంటున్నాడు. ఇక పెళ్లి తర్వాత లైఫ్ థ్రిల్లింగ్‌గా ఉండాలి అంతే.. రోజంతా కోట్లాడుకున్నా.. ఎంత కోపమొచ్చినా.. కూర్చొని చాయ్ తాగుతూ మాట్లాడుకొని సాల్వ్ చేసి ప్రేమతోనే పడుకోవాలి. అట్లాంటి పెళ్లి కావాలి నాకు అంటోంది ఆనంది. ఇక రమ్య సెకండ్ సెటప్ లాంటిదేమి లేదు ప్లీజ్ అంటున్నాడు ప్రియదర్శి. మొత్తానికి పెళ్లికి ముందు భిన్న అభిప్రాయాలు ఉన్న ఇద్దరు వ్యక్తులు.. పెళ్లి తర్వాత భార్యభర్తలుగా మారాక ఎలాంటి సంఘనలు జరిగాయనే నేపథ్యంలో ఫన్, సీరియస్ ఎలిమెంట్స్‌తో పక్కా వినోదాన్ని అందించేలా సినిమా ఉండబోతుందని టీజర్ హింట్ ఇచ్చేస్తుంది. ఆహ్లాదభరితమైన ప్రేమకథగా వస్తోన్న ఈ చిత్రంలో ప్రియదర్శి పాత్ర వైవిధ్యంగా ఉండబోతుందని టీజర్ చెప్పకనే చెబుతోంది.

## గొడవలేం లేవు: ప్రశాంత్ వర్మ



'హనుమాన్' సినిమాతో పాన్ ఇండియా రేంజ్‌లో మంచి సక్సెస్ అందుకున్న డైరెక్టర్ ప్రశాంత్ వర్మ, ఇప్పుడు ఒక కాంట్రావర్సీలో చిక్కుకున్నారు. 'హనుమాన్' నిర్మాతలైన ప్రైమ్‌షో ఎంటర్‌టైన్‌మెంట్‌తో సహా, పలువురు అగ్ర నిర్మాతలతో ఆయనకు అడ్వాన్సుల విషయంలో గొడవలు జరుగుతున్నాయని, ఈ పంచాయితీ ఫిల్మ్ ఛాంబర్ వరకు వెళ్లిందని గత కొద్ది రోజులుగా వార్తలు వస్తున్నాయి. అయితే ఈ రూమర్స్‌పై ప్రశాంత్ వర్మ చాలా గట్టిగా స్పందించారు. తనపై వస్తున్న ఆరోపణలన్నీ అబద్ధాలని కొట్టిపారేస్తూ అధికారిక ప్రెస్ నోట్ విడుదల చేశారు. కొన్ని మీడియా పోర్టల్స్, సోషల్ మీడియా ఛానెళ్లు.. ప్రైమ్‌షో ఎంటర్‌టైన్‌మెంట్ దాఖలు చేసిన ఫిర్యాదును, అలాగే తాను ఇచ్చిన రిప్లైలోని కొన్ని భాగాలను మాత్రమే పట్టుకుని, ఒకపక్షంగా, క్లారిటీ లేకుండా నిజానిజాలు తెలుసుకోకుండా" వార్తలు ప్రచారం చేస్తున్నాయని ప్రశాంత్ వర్మ తీవ్రంగా ఖండించారు. తనకు, ప్రైమ్‌షో సంస్థకు మధ్య వివాదం ఉన్న మాట వాస్తవమేనని, ఆ వివాదం ప్రస్తుతం తెలుగు ఫిల్మ్ ఛాంబర్, తెలుగు ఫిల్మ్ డైరెక్టర్స్ అసోసియేషన్ పరిశీలనలో ఉందని వర్మ అంగీకరించారు.

## శ్రీలీలకు బ్యాడ్ టైం తప్పేలా లేదు

టాలీవుడ్‌లో శ్రీలీల టైం బ్యాడ్ ఇంకా నడుస్తూనే ఉంది. పెళ్లిసందడి సినిమాతో తెలుగు తెరకు పరిచయమైన ఈ అమ్మడు నెక్ట్స్ మాస్ మహరాజ్ రవితేజతో ధమాకా చేసి సూపర్ హిట్ అందుకుంది. ఇక ఆ సినిమా నుంచి వరుస ఛాన్స్ లు అందుకోగా అందులో ఏది పెద్దగా వర్క్ అవుట్ కాలేదు. భగవంత్ కేసరి తో అమ్మడు యాక్షన్ సీన్స్ కూడా చేయగలదు అని ప్రూవ్ చేసుకుంది. ఆ సినిమాకు జాతీయ స్థాయిలో గుర్తింపు వచ్చింది అంటే శ్రీలీల కాంట్రిబ్యూషన్ ఉందని చెప్పొచ్చు. ఇక నెక్ట్స్ శ్రీలీల లాస్ట్ ఇయర్ సూపర్ స్టార్ మహేష్ తో గుంటూరు కారం సినిమా చేసింది. ఆ సినిమా కమర్షియల్ లెక్కలు ఎలా ఉన్నా సినిమాలో ఆమె డాన్స్ తప్ప ఏమి లేదని అనుకున్నారు. శ్రీలీల సినిమాలో ఉంటే డాన్స్ లు అదిరిపోతాయి.. ఐతే ఆమె పాత్రల ఎంపికలో మాత్రం ఇంకా తప్పులు చేస్తూనే ఉంది.





## రష్మికకు డబుల్ రెమ్యునరేషన్: ది గర్ల్ ఫ్రెండ్ ప్రొడ్యూసర్

నేషనల్ క్రష్ రష్మిక మందన్నా టైటిల్ రోల్‌లో నటిస్తోన్న చిత్రం ది గర్ల్‌ఫ్రెండ్. రాహుల్ రవీంద్రన్ డైరెక్ట్ చేస్తున్న ఈ చిత్రంలో దీక్షిత్ శెట్టి హీరోగా నటిస్తున్నాడు. ఈ మూవీ నవంబర్ 7న తెలుగు, తమిళం, మలయాళం, కన్నడ భాషల్లో థియేటర్లలో గ్రాండ్‌గా విడుదల కానుంది. ఈ నేపథ్యంలో రష్మిక అండ్ టీం ప్రమోషన్స్‌లో బిజీగా ఉంది టీం. వన్ ఆఫ్ ది ప్రొడ్యూసర్ ధీరజ్ మొగిలినేని ఆసక్తికర విషయాలు షేర్ చేసుకున్నాడు. ది గర్ల్‌ఫ్రెండ్ ఓ కాలేజ్‌లో జరిగే ప్రేమ కథ. ప్రేక్షకులపై చాలా ప్రభావం చూపించేలా సినిమా సాగుతుందన్నాడు. రష్మిక కథ విన్న వెంటనే ఎలాంటి రెమ్యునరేషన్ తీసుకోకుండా సినిమాకు ఒకే చెప్పింది. యూత్ ఆడియెన్స్‌కు ఈ చిత్రం బాగా కనెక్ట్ అవుతుంది. బాక్సాఫీస్ వద్ద ఘన విజయం సాధిస్తుందని దృఢంగా నమ్ముతున్నాం.



## ఎప్పటికీ మర్చిపోలేని సినిమా: సందీప్ వంగా

ప్రస్తుతం సందీప్ వంగా ప్రభాస్‌తో స్పిరిట్ కోసం పని చేస్తున్నాడు. 2026-27 సీజన్ లో మోస్ట్ అవైటెడ్ పాన్ ఇండియా చిత్రంగా స్పిరిట్ గురించి చాలా చర్చ జరుగుతోంది. అయితే సందీప్ రెడ్డి వంగా సినిమాలు అన్ని రకాల మసాలా అంశాలతో ప్రజల్ని విపరీతంగా ఆకర్షిస్తున్నాయి. కమర్షియల్ సినిమాల కింగ్ గా మారిన సందీప్ ని ప్రభావితం చేసిన సినిమా ఏది? అన్న ప్రశ్న వేస్తే, దీనికి అతడే స్వయంగా జవాబిచ్చాడు. తనను అత్యంత ప్రభావితం చేసిన సినిమాలలో శివ అని తెలిపాడు. ఆర్జీవీ తెరకెక్కించిన ఈ కల్ట్ క్లాసిక్ సినిమా ప్రభావం తనపై చాలా ఎక్కువగా ఉందని అన్నాడు సందీప్. శివ చిత్రాన్ని ఇప్పటికీ మర్చిపోలేనని అన్నాడు.






# భారత మహిళ.. విజయహో!

## విశ్వవిజేతగా టీమిండియా మహిళల జట్టు.. 52 పరుగుల తేడాతో హర్మన్ సేన ఘన విజయం

### దీప్తి శర్మ మ్యాజిక్.. షెఫాలీ వర్మ ఆల్‌రౌండ్ షో.. సఫారీ కెప్టెన్ లారా వోల్వార్ట్ (101) అద్భుత సెంచరీ వృథా

**భారత మహిళల క్రికెట్ జట్టు చరిత్ర సృష్టించింది. కోట్లాది మంది అభిమానుల ఆశలను నిజం చేస్తూ తొలిసారిగా ఐసీసీ మహిళల ప్రపంచకప్ టైటిల్‌ను కైవసం చేసుకుంది. నవీ ముంబైలోని డీవై పాటిల్ స్పోర్ట్స్ అకాడమీ వేదికగా జరిగిన ఉత్కంఠభరిత ఫైనల్ మ్యాచ్‌లో దక్షిణాఫ్రికాపై 52 పరుగుల తేడాతో అద్భుత విజయం సాధించింది.**

**మొదట బ్యాటింగ్‌లో షఫాలీ వర్మ అద్భుత ఇన్నింగ్స్‌కు, చివర్లో దీప్తి శర్మ ఆల్‌రౌండ్ ప్రదర్శన తోడవడంతో భారత్ జగజ్జేతగా నిలిచింది. దక్షిణాఫ్రికా కెప్టెన్ లారా వోల్వార్ట్ వీరోచిత సెంచరీ చేసినా, తన జట్టును గెలిపించలేకపోయింది. ఈ మెగా ఫైనల్‌లో టాస్ గెలిచిన దక్షిణాఫ్రికా కెప్టెన్, ఫీల్డింగ్ ఎంచుకుంది.**

బ్యాటింగ్‌కు దిగిన భారత జట్టుకు ఓపెనర్లు స్మృతి మంధన (45), షఫాలీ వర్మ (87) అద్భుతమైన శుభారంభం అందించారు. ముఖ్యంగా షఫాలీ తనదైన శైలిలో దూకుడుగా ఆడి కేవలం 78 బంతుల్లో 7 ఫోర్లు, 2 సిక్సర్లతో 87 పరుగులు చేసి భారీ స్కోరుకు పునాది వేసింది. వీరిద్దరూ తొలి వికెట్‌కు 104 పరుగుల భాగస్వామ్యం నెలకొల్పారు. అనంతరం జెమీమా రోడ్రిగ్స్ (24), కెప్టెన్ హర్మన్‌ప్రీత్ కౌర్ (20) త్వరగానే వెనుదిరిగినా, ఆల్‌రౌండర్ దీప్తి శర్మ (58) బాధ్యతాయుతమైన ఇన్నింగ్స్‌తో ఆదుకుంది. చివరి ఓవర్లలో వికెట్ కీపర్ రిచా ఘోష్ (24 బంతుల్లో 34) మెరుపులు మెరిపించడంతో భారత జట్టు నిర్ణీత 50 ఓవర్లలో 7 వికెట్ల నష్టానికి 298 పరుగుల భారీ స్కోరు సాధించింది. సఫారీ బౌలర్లలో అయాబొంగా ఖాకా 3 వికెట్లు పడగొట్టింది. 299 పరుగుల భారీ లక్ష్య ఛేదనలో దక్షిణాఫ్రికాకు ఆదిలోనే ఎదురుదెబ్బ తగిలింది. అయితే, కెప్టెన్ లారా వోల్వార్ట్ (101) ఒంటరి పోరాటం చేసింది. ఒకవైపు వికెట్లు పడుతున్నా, ఆమె మాత్రం అద్భుతమైన షాట్లతో భారత బౌలర్లపై ఒత్తిడి పెంచింది. కేవలం 98 బంతుల్లో 11 ఫోర్లు, 1 సిక్సర్‌తో సెంచరీ పూర్తి చేసుకుంది. అయితే, మిగతా బ్యాటర్ల నుంచి ఆమెకు సరైన సహకారం అందలేదు. సఫారీ ఇన్నింగ్స్‌లో అనెరీ డెర్క్‌సెన్ (35) మినహా ఎవరూ రాణించలేకపోయారు. ఈ దశలో భారత ఆల్‌రౌండర్ దీప్తి శర్మ బంతితో మ్యాజిక్ చేసింది. కీలకమైన వోల్వార్ట్ వికెట్‌తో సహా మొత్తం 5 వికెట్లు పడగొట్టి దక్షిణాఫ్రికా పతనాన్ని శాసించింది. ఆమె అద్భుతమైన బౌలింగ్‌కు




సఫారీ బ్యాటర్లు నిలవలేకపోయారు. దీప్తికి తోడుగా షఫాలీ వర్మ కూడా 2 కీలక వికెట్లు తీసి తన ఆల్‌రౌండ్ సత్తాను చాటింది. దీంతో దక్షిణాఫ్రికా జట్టు 45.3 ఓవర్లలో 246 పరుగులకే ఆలౌట్ అయింది. ఫలితంగా భారత అమ్మాయిలు 52 పరుగుల తేడాతో చారిత్రక విజయాన్ని అందుకుని ప్రపంచకప్‌ను గర్వంగా ముద్దాడారు. 2005, 2017 వన్డే వరల్డ్ కప్ లలో టీమిండియా అమ్మాయిలు ఫైనల్ చేరినా, కప్ దక్కించుకోలేకపోయారు. ఇప్పుడా లోటును తీర్చుతూ, చారిత్రక విజయం నమోదు చేశారు.

## ఈ విజయం భవిష్యత్ ఛాంపియన్లకు ప్రేరణ

టోర్నమెంట్ ఆద్యంతం మన జట్టు అసాధారణమైన టీమ్‌వర్క్, పట్టుదలను ప్రదర్శించింది. మన క్రీడాకారిణులకు నా అభినందనలు. ఈ గెలుపు కేవలం ఒక ట్రోఫీ మాత్రమే కాదు, దేశంలోని భవిష్యత్ ఛాంపియన్లకు గొప్ప ప్రేరణగా నిలుస్తుంది. ఈ చారిత్రక విజయం, క్రీడలను కెరీర్‌గా ఎంచుకోవడానికి యువతను మరింత ప్రోత్సహిస్తుంది. భారత జట్టు సాధించిన ఈ అద్భుతమైన విజయం దేశానికి గర్వకారణం.

- ప్రధాని నరేంద్ర మోదీ



# అదిరిందయ్యా సుందరం

### వాషింగ్టన్ సుందర్ విధ్వంసం

### మూడో టీ20లో భారత్ ఘన విజయం!

### ఐదు మ్యాచ్‌ల సిరీస్‌లో 1-1



ఆస్ట్రేలియాతో ఐదు టీ20ల సిరీస్‌లో టీమిండియా ఎట్టకేలకు విజయాన్నందుకుంది. హెూబర్ట్ వేదికగా ఆదివారం జరిగిన మూడో టీ20లో సమష్టిగా రాణించిన భారత్ 5 వికెట్ల తేడాతో గెలుపొందింది. లోయరార్డర్ బ్యాటర్ వాషింగ్టన్ సుందర్ విధ్వంసకర బ్యాటింగ్‌తో భారత విజయంలో కీలక పాత్ర పోషించాడు. ఈ మ్యాచ్‌లో ముందుగా బ్యాటింగ్ చేసిన ఆస్ట్రేలియా నిర్ణీత 20 ఓవర్లలో 6 వికెట్లకు 186 పరుగులు చేసింది. టీమ్ డేవిడ్(38 బంతుల్లో 8 ఫోర్లు, 5 సిక్స్‌లతో 74), మార్కస్ స్టోయినీస్(39 బంతుల్లో 8 ఫోర్లు, 2 సిక్స్‌లతో 64) హాఫ్ సెంచరీలతో రాణించారు. భారత బౌలర్లలో అర్ష్‌దీప్ సింగ్(3/31) మూడు వికెట్లు తీయగా.. వరుణ్ చక్రవర్తి(2/33) రెండు వికెట్లు తీయగా.. శివమ్ దూబే(1/43) ఒక వికెట్ పడగొట్టాడు. అనంతరం భారత్ 18.3 ఓవర్లలో 5 వికెట్లకు 188 పరుగులు చేసి గెలుపొందింది. వాషింగ్టన్ సుందర్(23 బంతుల్లో 3 ఫోర్లు, 4 సిక్స్‌లతో 49 నాటౌట్), జితేష్ శర్మ(13 బంతుల్లో 3 ఫోర్లతో 22 నాటౌట్), తిలక్ వర్మ(26 బంతుల్లో ఫోర్, సిక్స్‌తో 29) రాణించారు. ఆస్ట్రేలియా బౌలర్లలో నాథన్ ఎల్లిస్ మూడు వికెట్లు తీయగా.. గ్జేవియర్ బార్ట్‌లెట్, మార్కస్ స్టోయినీస్ తలో వికెట్ తీసారు. బౌలింగ్‌లో మూడు వికెట్లు తీసిన అర్ష్‌దీప్ సింగ్‌కు ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్ అవార్డ్ దక్కింది. ఈ మైదానంలో ఇదే భారీ టీ20 స్కోర్ కావడంతో పాటు అత్యధిక ఛేజింగ్ రికార్డ్ కూడా ఇదే కావడం విశేషం. ఈ మైదానంలో ఆస్ట్రేలియాకు ఇదే తొలి టీ20 పరాజయం కావడం గమనార్హం. ఈ గెలుపుతో ఐదు మ్యాచ్‌ల సిరీస్‌లో భారత్ 1-1తో కొనసాగుతుంది. నాలుగో టీ20 గురువారం గోల్డ్ కోస్ట్ వేదికగా జరగనుంది. తొలి మ్యాచ్ వర్షార్పణం కాగా.. రెండో టీ20 ఆసీస్ గెలిచిన సంగతి తెలిసిందే. భారీ లక్ష్యచేధనలో టీమిండియా ఇన్నింగ్స్‌ను అభిషేక్ శర్మ దూకుడుగానే ఆరంభించాడు. భారీ సిక్సర్లతో ఆసీస్ బౌలర్లపై విరుచుకుపడ్డాడు. కానీ అతన్ని నాథన్ ఎల్లిస్ బోల్తా కొట్టించాడు.

# విదేశాల్లో ఐపీఎల్ వేలం?

### డిసెంబర్ 14న వేలం జరపాలని బీసీసీఐ ప్రణాళిక

### భారత్‌లో పెళ్లిళ్ల సీజన్ కావడంతో వేదికల కొరత

### గల్ఫ్ దేశాల్లో వేలం.. రేసులో ముందున్న అబుదాబి

ఇండియన్ ప్రీమియర్ లీగ్ (ఐపీఎల్) 2026 సీజన్‌కు సంబంధించిన మినీ వేలంపై కీలక సమాచారం బయటకు వచ్చింది. ముందుగా ఈ వేలాన్ని భారత్‌లోనే నిర్వహిస్తారని వార్తలు వచ్చినా, తాజాగా ఈ ప్రణాళికలో మార్పు చోటుచేసుకున్నట్లు తెలుస్తోంది. ఈసారి కూడా వేలాన్ని విదేశాల్లో, ముఖ్యంగా గల్ఫ్ దేశాల్లో నిర్వహించేందుకు బీసీసీఐ మొగ్గు చూపుతోంది. అందుబాటులో ఉన్న సమాచారం ప్రకారం, డిసెంబర్ 14న ఈ మినీ వేలం జరగనుంది. ఒకటి కంటే ఎక్కువ రోజులు అవసరమైతే డిసెంబర్ 13ని కూడా పరిశీలనలో ఉంచారు. వేదికగా యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్ (యూఏఈ)లోని అబుదాబి పేరు ప్రముఖంగా వినిపిస్తోంది. దీంతో పాటు ఒమన్, ఖతార్ వంటి దేశాలను కూడా బీసీసీఐ పరిశీలిస్తున్నట్లు సమాచారం. ఫ్రాంచైజీలకు ఇంకా అధికారికంగా నగరం పేరు చెప్పనప్పటికీ, గల్ఫ్‌లో నిర్వహణపై సూచనలు అందినట్లు తెలుస్తోంది. వాస్తవానికి ఈసారి వేలాన్ని స్వదేశంలోనే నిర్వహించాలని బీసీసీఐ బలంగా భావించింది. ముంబై, బెంగళూరు నగరాలను ప్రాథమికంగా ఎంచుకున్నప్పటికీ, అదే సమయంలో దేశవ్యాప్తంగా పండగలు, పెళ్లిళ్ల సీజన్ కావడంతో అనువైన వేదికను ఖరారు చేయడం సవాలుగా మారింది. ఈ కారణంగానే వేలాన్ని విదేశాలకు తరలించాలని నిర్ణయించినట్లు వార్తలు వస్తున్నాయి. ఈ వేలానికి సంబంధించి ఆటగాళ్ల రిటెన్షన్ (అట్టిపెట్టుకోవడం) కోసం ఫ్రాంచైజీలకు నవంబర్ 15ను చివరి తేదీగా నిర్ణయించారు. ఈ గడువులోగా ఫ్రాంచైజీలు తాము




అట్టిపెట్టుకునే, విడుదల చేసే ఆటగాళ్ల జాబితాను సమర్పించాల్సి ఉంటుంది. నవంబర్ 15 లోపే వేలం తేదీ, వేదికపై బీసీసీఐ నుంచి అధికారిక ప్రకటన వెలువడే అవకాశం ఉంది. తొలిసారిగా గత సీజన్‌లో రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు (ఆర్సీబీ) జట్టు ఐపీఎల్ టైటిల్ గెలుచుకున్న సంగతి తెలిసిందే. ఈ నేపథ్యంలో, టైటిల్‌ను నిలబెట్టుకునేందుకు ఆర్సీబీ తమ జట్టును ఎలా తీర్చిదిద్దుకుంటుంది, ఎవరెవరిని రిటైన్ చేసుకుంటుందనే దానిపై అభిమానుల్లో తీవ్ర ఆసక్తి నెలకొంది.

ఈవార్తలు
ప్రజావాణి
సంపాదకీయం
సోమవారం 3-11-2025 | www.evarthalu.com
నేటి ఈవార్తలు

# దశావతారం



## చేప రాక్షసుణ్ణి చంపుతుందా?
## తాబేలు పర్వతాన్ని మోస్తుందా?
### ఒక వరాహం భూమిని ఎలా కాపాడింది?
### పొట్టి మనిషిని చూశాము పొడవు మనిషిని చూశాము
### కానీ, మనిషీ, జంతువు కలిసి ఉన్న జీవి సాధ్యమేనా?
### నారాయణుడి దశావతారాలు వాస్తవమేనా?
### పది అవతారాల్లో మరేదైనా లాజిక్ ఉందా?

## ఏమిటీ సీక్రెట్?

దేవుళ్లు.. మనకు బోలెడు మంది.. మూడు కోట్ల మంది. ఒక్కొక్కరిదీ ఒక్కో రూపం.. ఒక్కో తేజం.. వీళ్లలో అవతారాలన్న పేరు చెప్పగానే గుర్తుకు వచ్చేది మాత్రం విష్ణుమూర్తే. ప్రపంచంలో ఏ దుర్మార్గుడు రెచ్చిపోయినా వాణ్ణి శిక్షించే బాధ్యత మాత్రం విష్ణువుదే. అందుకోసం రకరకాల రూపాల్లో అవతరిస్తుంటాడు.. క్రిమినల్స్ను శిక్షిస్తుంటాడు. ఇక్కడే ఓ విచిత్రం, సందేహం రెండూ ఉన్నాయి. విష్ణుమూర్తి పది అవతారాలు ఒక్కొక్కటీ ఒక్కో రకంగా ఉంటాయి. ఒకసారి చేప, ఒకసారి తాబేలు, ఒకచోట మనిషీ, సింహం కలిసిన శరీరం, ఇంకోచోట వామనుడు.. ఏమిటివన్నీ.. ఇవన్నీ అవతారాలేనా? వీటి వెనుక సీక్రెట్ ఏదైనా ఉందా? వాట్ ఇట్ ఈజ్..?

మత్స్య, కూర్మ, వరాహ, నారసింహ, వామన, పరశురామ, రామ, కృష్ణ, బుద్ధ, కల్కి.. ఇవన్నీ నారాయణుడి దశావతారాలు.. ఈ అవతారాలన్నీ కూడా వింతరూపాల్లో వుంటాయి. చేప మనిషిని చంపుతుంది. తాబేలు పర్వతాన్ని మోస్తుంది. మనిషీ, జంతువు కలగలిసిన రూపం– నారసింహం.. దశావతారాల్లో బుద్ధుడు ఉన్నాడు. ఈ బుద్ధుడు గౌతమ బుద్ధుడు కాదు. మనకు తెలియని మరో బుద్ధుడు మరెవరో వున్నారనటానికి ఆధారం లేదు. ఈ గౌతమబుద్ధుడే విష్ణువు అవతారమనే వాదన బలంగానే ఉంది. వాస్తవానికి దశావతారాల్లో మర్మం ఏమిటి? ఆదిశక్తి చేతి వేళ్లగోళ్ల నుంచి విష్ణువు

**అవతారాలు పుట్టాయా? ఇందులో దాగున్న సృష్టి రహస్యం ఏమిటి? అంతా మిథ్యేనా? సైంటిఫిక్ రీజన్ ఏమైనా ఉందా? విష్ణుమూర్తి దశావతారాలు కేవలం కథలు కావు.. ఇవి మన జీవితానికి సంబంధించిన అత్యంత ముఖ్యమైన విషయాలను విప్పి చెప్తున్నాయి. సృష్టి పరిణామ క్రమంలో ఒక కీలకమైన అంశాన్ని నిరూపిస్తున్నాయి. ఇవి సాదాసీదా అవతారాలు కావు. సినిమాల్లో ట్రిక్స్ అంతకంటే కావు.. పుక్కిటి పురాణాలు అంతకంటే కావు. వీటి వెనుక సృష్టిలోని రహస్యం అంతా దాగుంది. విష్ణువుకు సంబంధించిన పురాణాల ప్రకారం, వాటిల్లో కథల ప్రకారం ఆయన చాలా అవతారాలే ధరించాడట. మనకు బాగా తెలిసినవి మాత్రం పదే. అందులో ఒకటి కల్కి. అది ఇంకా రావలసి ఉంది. అంటే ఇప్పటికి తొమ్మిది అవతారాలు పూర్తయ్యాయన్నమాట.**

ఈ అవతారాల నేపథ్యం కూడా అద్భుతంగా ఉంటుంది. వేదాలను దొంగిలించిన సోమకాసురుడనే రాక్షసుణ్ణి చంపి, ఆ వేదాలను కాపాడటం కోసం నారాయణుడు చేప.. అదే మత్స్య రూపంలో అవతరించాడు. అమృతం కోసం పాల సముద్రాన్ని చిలికేందుకు మంథర పర్వతాన్ని తీసుకువస్తే అది మునిగిపోకుండా ఉండేందుకు తాబేలుగా దాని బరువును మోశాడు నారాయణుడు.. ఈ సముద్ర మథనంలో అమృతం చివరకు దొరికింది కానీ, దానికి ముందు దొరికినవి చాలా చాలానే ఉన్నాయి. భూమిని చాపగా చుట్టేసి దాన్ని పట్టుకుని పోయిన హిరణ్యాక్షుణ్ణి చంపేందుకు విష్ణువు వరాహరూపాన్ని ధరించాల్సి వచ్చింది. తమ్ముణ్ణి చంపినందుకు పగబట్టి అర్థం లేని వరాలు కోరి బీభత్సాన్ని సృష్టించిన హిరణ్యకశిపుని హతమార్చేందుకు నరసింహుడిగా విష్ణువు స్తంభం నుంచి ఆవిర్భవించాడు. తరువాత షార్టెస్ట్ మ్యాన్ ఆఫ్ ది వరల్డ్ వామనుడి అవతారంలో విష్ణువు పుట్టాడు. బలిని అణచేసి యావత్ ప్రపంచాన్ని ఆవరించే శాడు. హింసకు ప్రతిరూపం పరుశురాముడు.. 21 సార్లు రాజులను వెంటాడి వేటాడిన వాడు. పరిపూర్ణ మానవుడిగా అవతరించిన వాడు శ్రీరాముడు. రావణుడిని చంపి పాలకులకు ఓ రోల్ మోడల్గా నిలిచిన వాడు. ఇక కృష్ణుడి అవతారం తెలియందెవరికి.. ఆయన గురించి చెప్పాల్సిందేముంది. జగత్తుకు గురువుగా నిలిచి మార్గదర్శనం చేసిన వాడు కృష్ణుడు.

కథలు వింటే పుక్కిటి పురాణాలు.. చూస్తే సినిమాలా అనిపిస్తుంది. కానీ, దశావతారాల వెనుక అసలు కథ వేరే ఉంది. మన జీవితంతో ముడిపడి ఉన్న కథ.. మనిషి ఎవల్యూషన్ మూలాలున్న కథ. సృష్టి పరిణామ క్రమాన్ని నిర్దేశించే కథ.. జీవ పరిణామ సిద్ధాంతాన్ని రుజువు చేసే కథ.. దశావతారాలు చెప్తున్న సైన్స్. విష్ణుమూర్తి అవతారాలు పది కూడా ఒకదానితో ఒకటి ముడిపడి ఉన్నవే. సైన్స్లోని పలు శాఖలు తీవ్ర పరిశోధనలు చేసి భూమ్మీద జీవులు ఏ విధంగా ఉద్భవించాయో చెప్తున్న అనేక విషయాలకు దశావతారాలు ఒకే ఒక్క సీక్వెన్స్లో జవాబు చెప్తాయి. ఒక గ్రహంపై జీవరాశులు ఉండాలంటే ముందుగా ఉండాల్సింది నీటి వనరు.. నీటి జాడలు ఉంటే అక్కడ జీవరాశులు పుట్టేందుకైనా, మనగలిగేందుకైనా అవకాశం ఉంటుంది. ఇందుకోసమే అమెరికా సహా అగ్రరాజ్యాలన్నీ ఇతర గ్రహాల్లో ఎక్కడైనా నీటి జాడలున్నాయా అని పరిశోధనలు చేస్తూనే ఉన్నాయి. మార్స్లో నీటి జాడలు ఉన్నాయని కూడా ఇప్పు డిప్పుడే చెప్తున్నాయి. భూమి కూడా అంతే, నీటి జాడ ఉన్నప్పుడే ప్రకృతిలోని మిగతా జీవచరాలు అభివృద్ధి చెందుతాయి, నదీతీరాల వెంటనే నాగరికత అభివృద్ధి చెందినట్లు.. వీటికీ దశావతారాలకు సంబంధం ఏమిటని ప్రశ్నించవచ్చు. కానీ, ఉంది. ఈ రెంటికీ అవినాభావ సంబంధం ఉంది. విష్ణుమూర్తి పాలసముద్రంపై నివాసమున్నాడు.. సృష్టికి మొదటి సంకేతం అది. భూమిపై ఉన్న నీటిజాడకు ఈ పాలసముద్రం సంకేతం. ఈ సముద్రం నుంచే జీవరాశి పుట్టింది.. నాగరికత అభివృద్ధి చెందింది. భూమిపై తొలి జీవ కణం నీటిలోనే పుట్టిందంటారు. విష్ణువు అవతారాల్లో తొలి అవతారం చేప.. ఇది జలచరం.. మీనావతారంలో విష్ణువు వేదాలను రక్షించాడు.. వేదాలంటే విజ్ఞానం.. జీవి పుట్టుకతోనే విజ్ఞానం అన్వేషణలో పడింది. జ్ఞానాన్ని సాధించేందుకు పోరాటం చేసింది. సంపాదిం చుకుంది. దాన్ని ఆధారం చేసుకుని ఎదుగుతూ వచ్చింది. విష్ణువు తొలి అవతారంలోని మర్మం ఇదే.

కోవెల సంతోష్ కుమార్
రచయిత
9052116463

**ఒక గ్రహంపై నీటి జాడ గురించి ప్రస్తుతం జరుగుతున్న అన్వేషణ సామాన్యమైంది కాదు.. నీటి ఉనికి ఉంటే చాలు.. ఆ గ్రహంపై సమస్తం సమకూర్చుకోవచ్చు. క్షీరసాగర మథనం ఇందుకు స్పష్టమైన ఉదాహరణ. ఈ సాగర మథనం నుంచే పాడి పంటలు పుట్టాయి. అంటే కామధేనువు, కల్పవృక్షం అన్నమాట. విషం ఇందులోంచే పుట్టింది.. అమృతమూ ఇక్కడే లభించింది. మంచీ ఇక్కడ ఉంది.. చెడూ ఉంది.. సముద్ర మథనం భారాన్నంతా మోసిన వాడు తాబేలు రూపంలో అవతరించిన విష్ణువు. అంతే కాదు.. చేప జల చరమయితే, తాబేలు ఉభయచరం.. ఇది నీటిలోనూ, భూమిలోనూ జీవించగలిగే జంతువు.. జీవ పరిణామ ఎదుగుదలలో ఇదొక కీలక పరిణామం. తొలి రెండు అవతారాలే కాదు.. విష్ణువు మిగతా అవతారాలు సైతం జీవి జంతువు నుంచి మనిషిగా, మనీషిగా ఎదగటాన్ని సూచిస్తున్నాయి. మన ప్రాచీనులు చెప్పిన గాడ్స్ థియరీలో దశావతారాలు చాలా కీలకమైనవి. సైన్స్ శాస్త్రోక్తంగా చెప్పిన అంశాలను అవతారాల గాథల్లో తేలిగ్గా అర్థం అయ్యేలా చేసిన ఆర్గనైజ్డ్ సిస్టమ్ మన మైథాలజీ.**

OWNED, PUBLISHED BY **BOMMAKANTI SHRAVAN KUMAR**, PRINTED BY SUNDAY PRINTING PRESS, #3-4297, SARASWATHI COMPLEX, SVN COLONY, GUNTUR - 522006, ANDHRA PRADESH. PUBLISHED AT #4-36, BALWANTHAPOOR, MALLIAL MANDAL, JAGITIAL DISTRICT - 505452, TELANGANA, EMAIL ID: contact@evarthalu.com, PHONE NUMBER: 9440455811, EDITOR: **BOMMAKANTI SHRAVAN KUMAR**, RNI REGD NO.: TGTEL/25/A1385. CORPORATE OFFICE: #1-5-431/20/4, JONNABANDA, OLD ALWAL, MEDCHAL MALKAJGIRI DISTRICT - 500010, TELANGANA. Landline: 040-35673004.